
# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

సంపుటి : 2 | సంచిక : 296 | బుధవారం | 27 - 03 - 2025 | పేజీలు : 8 | వెల : 5.00 | www.telanganamuchatlu.in


- గులాబీ కాదని చెయ్యి అందుకుంటే...
- కడియం శ్రీహరికి అసలు పంచాయతీ మళ్ళీ మొదలైన వైనం..!
- కడియం శ్రీహరి ఇందిరాను నిర్లక్ష్యం చేయడం వల్లే.. ఆ సభకి దూరం..!
- ఇందిరా అమితుమీ తేల్చుకునేందుకు సిద్ధం..?

# కడియంకు కలసి రాని.. కాలం..!

**స్టేషన్ ఘనాపూర్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పూర్తిగా తొలగిపోలేదనే టాక్..?**

**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**

రామేశ్వరం వెళ్ళినా.. శనీశ్వరం తప్పడం లేదనన్నటు తయారైందంట.. ఆ సీనియర్ ఎమ్మెల్యే పరిస్థితి. గులాబి పార్టీలో వర్గ పోరు తట్టుకోలేక హస్తం పార్టీలోకి మారితే.. ఇప్పుడు ఇక్కడా అదే వర్గపోరుతో తలపట్టుకోవాల్సి వస్తుందంట. ఉపముఖ్యమంతి సహా పలు పదవులు అనుభవించిన ఆ నాయకుడు ఇంటిపోరు తట్టకోలేక సతమతమవు తున్నారంట. ఇప్పుడు తనపై అధిష్టానానికి ఫిర్యాదు చేయడానికి ప్రత్యర్థులు సిద్ధమవు తుండటంతో టెన్షన్ పడిపోతున్నారంట.ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ రాజకీయాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రులుగా పనిచేసిన ఇద్దరు నేతలు అక్కడివారే. తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి ఇద్దరూ నిన్నటి వరకు గులాబీ పార్టీలో ఉన్నవారే. రాజయ్యకు ఉపముఖ్యమంత్రి పదవి తీసేసి కడియం శ్రీహరికి కట్టబెట్టినప్పటి నుంచి ఇద్దరి మధ్య ఉన్న పోరు తారాస్థాయికి చేరుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాజయ్యను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇవ్వడంతో రాజయ్య వర్గం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, గులాబీ పార్టీ అధిష్టానం తీరుతో విసుగెత్తిన కడియం శ్రీహరి గెలిచాక హస్తం పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నుండి తన కూతురు కడియం కావ్యకి వరంగల్ ఎంపీ టికెట్ తెచ్చుకొని ఆమె విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా కడియం శ్రీహరికి అసలు పంచాయతీ మళ్ళీ మొదలైందంట. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 800 కోట్ల రూపాయల నిధులతో పలు కీలక అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.సీఎం పర్యటన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా కేడర్‌తో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసిన కడియం.. రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న సింగపురం ఇందిరను పక్కన పెట్టారనే టాక్ వినిపిస్తోంది. పార్టీలో చేరిన తర్వాత అందరినీ కలుపుకోవాల్సిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తన వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని.. ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలను నాయకులను పట్టించుకోలేదని చర్చ జరుగుతుంది.అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరికి గట్టి పోటీ ఇచ్చి ఓటమిపాలైన సింగపురం ఇందిరను కావాలనే కార్నర్ చేస్తున్నాడని ఇందిరా అనుచరులు చెబుతున్నారట. అందుకోసమే సీఎం సభ ఏర్పాట్ల విషయంలోనూ, సీఎంను నియోజకవర్గానికి ఆహ్వానించే విషయంలోనూ ఇందిరకు సమాచారం ఇవ్వలేదట. సాధారణ కార్యకర్తలారా ఇందిరను ట్రీట్ చేశారని అందుకే సీఎం సభకు సైతం ఇందిర డుమ్మా కొట్టారని ఆమె సన్నిహితులు గుసగుసలాడుకుంటున్నారుఅ క్రమంలో స్టేషన్ ఘన్పూర్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పూర్తిగా తొలగిపోలేదనే టాక్ నడుస్తోంది. చాలా రోజులుగా ఇందిర వర్గం కాంగ్రెస్‌లోకి వచ్చిన కడియం శ్రీహరి వర్గంతో కలవలేక పోతుందట. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇందిర తన కేడర్‌ని కాపాడుకుంటూ వచ్చే ప్రయత్నం చేశారు. మారిన రాజకీయాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి పార్లమెంట్ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇక అప్పటినుంచి వీరి మధ్య వర్గ విభేదాలు మరింత పెరిగిపోయా యంటున్నారు.కడియం శ్రీహరి చేరిక సందర్భంగా ఇందిరకి కాంగ్రెస్ పెద్దల నుంచి పలు హామీలు లభించినట్లు చెప్తున్నారు..

■ మిగతా 4లో..



## బెట్టింగ్ యాప్స్ కేసులో హైకోర్టును ఆశ్రయించిన విష్ణుప్రియ

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

బెట్టింగ్ యాప్స ప్రమోషన్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో యాంకర్ విష్ణుప్రియ మీద కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసుల విచారణకు హాజరైన విష్ణుప్రియ తాజాగా దీనిపై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. బెట్టింగ్ యాప్స కేసులో తనపై నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లను క్వాష్ చేయాలంటూ యాంకర్ విష్ణుప్రియ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు నేడు (మంగళవారం) నాడు విచారణ జరపనుంది.బెట్టింగ్ యాప్ ప్రమోషన్స వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తుంది. ఇప్పటికే ఈ వివాదంలో దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మీల పేర్లు తెర మీదకు వచ్చాయి. వారితో పాటు పలువురు నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీనిలో భాగంగానే యాంకర్ విష్ణుప్రియతో పాటు పలువురు సెలబ్రిటీల మీద పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విష్ణుప్రియ ఆమె సోషల్ మీడియా ఖాతాల్లో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసేవిధంగా విపరీతంగా పోస్టింగ్‌లు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం పోలీసులు ఆమెను విచారించారు. విష్ణుప్రియ మొబైల్ కూడా సీజ్ చేశారు.విచారణలో భాగంగా విష్ణుప్రియ బెట్టింగ్ యాప్ ప్రమోషన్స కోసం భారీ ఎత్తున డబ్బు తీసుకున్నట్లు అంగీకరించారు. మొత్తం 15 బెట్టింగ్ యాప్‌లను ఆమె ప్రమోట్ చేశారు. ఇంస్టాగ్రామ్ వేదికగా ఈ యాప్స్‌ను ప్రమోట్ చేసినట్లు అంగీకరించారు. ఈ క్రమంలో పోలీసులు విష్ణుప్రియ బ్యాంకు స్టేట్మెంట్‌ను కూడా తీసుకున్నారు. ఎప్పుడు విచారణకు పిలిచినా అందుబాటులో ఉండాలని పంజాగుట్ట పోలీసులు విష్ణుప్రియను ఆదేశించారు. ఇక పంజాగుట్టలో..

■ మిగతా 4లో..



## టీచర్ ఉద్యోగాల భర్తీపై మంత్రి హరీశ్‌రావు కౌంటర్

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

## కేటీఆర్‌కు రాజాసింగ్ మాస్ వార్నింగ్

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :**



మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వార్నింగ్ ఇచ్చారు. పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటా మంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన.. పోలీసు శాఖతో పెట్టుకోవద్దని మాజీ మంత్రిని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశంతో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. ఏకంగా రేవంత్ రెడ్డి బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా.. ఆ సమయంలో తనను అరెస్ట్ చేసిన వారిని ఏమీ చేయలేదని తెలిపారు. కానీ 'మేము అధికారంలోకి వచ్చాక రిటైరైన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటాం' అని ఇప్పుడు కేటీఆర్ అంటున్నారని.. పోలీసు శాఖతో పెట్టుకోవద్దు అంటూ మాజీ మంత్రికి ఎమ్మెల్యే మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఎవరు అధికారంలో ఉంటే వాళ్లు చెప్పిన విధంగా పోలీసులు లీగల్‌గానే పనిచేస్తారని... ఆ విషయం మర్చిపోయారా కేటీఆర్ అని ప్రశ్నిం చారు. బీజేపీ కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టి పోలీసులు జైలుకు పంపిస్తు న్నారని... బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జ్‌కు చూశారన్నారు. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు కూడా పంపించారని రాజా సింగ్ గుర్తుచేశారు. అయితే ఇందులో షాకింగ్ విషయం ఏంటంటే.. తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించే సమయంలో సొంత పార్టీ నేతలు, కొంతమంది బీజేపీ అధికారులు.. పోలీసులకు మద్దతుగా నిలిచారన్నారు. ఈ విషయాన్ని ఓ పోలీస్ అధికారే స్వయంగా తనతో చెప్పారన్నారు. 'రాజాసింగ్! నీ పైన పీడీ ఆక్ట్ వేస్తున్నాం. మీ బీజేపీ వాళ్లు కూడా వేయండి అన్నారు' అని చెప్పినట్లు తెలిపారు. అయితే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. తనను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను, బీజేపీ అధికారులను ఏం చేయాలని ప్రశ్నించారు. ఇప్పటి కూడా తమ పార్టీలోని అధికారులే తనను వెన్నుపోటు పొడవాలనే ఆలోచనలో ఉన్నట్లు సంచలన వ్యాఖ్యలు చేశారు.

## విద్యా వ్యవస్థను బాగుచేస్తాం

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**



విద్యాశాఖ బడ్జెట్ పద్దుపై అసెంబ్లీలో మంగళవారం చర్చ జరిగింది. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానం ఇచ్చారు. గత ఏడెనిమిదేళ్లుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని..ఇది మంచి పరిణామం కాదని చెప్పారు. 662 రెసిడెన్షియల్ స్కూళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని అన్నారు. సుమారు 2 లక్షల మంది విద్యార్థులు అరకొర వసతులతోనే చదువు కొంటున్నారని చెప్పారు. స్కూళ్లు మంజూరు చేయడం మంచిదే.. కానీ వసతులు కూడా కల్పించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతూ పాఠశాలలకు పంపించే పరిస్థితి ఉండకూడదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. స్కూల్‌లో ఉన్న పిల్లల గురించి ఇంటి దగ్గర ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందే పరిస్థితులు ఉండకూడదని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. అన్ని స్కూళ్లలో అవసరమైన దిద్దుబాటు చర్యలు ప్రారంభించామని అన్నారు. విశాల తరగతి గదులు, ల్యాబులు, తాగునీటి వసతి, క్లీన్ వాష్ రూమ్స అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ టీచర్లంతా మెరిటోరియస్.. వారు తాము పనిచేసే విద్యా సంస్థలను ఓన్ చేసుకోవాలని సూచించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను రూ. 11,600 కోట్లతో ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.ఎడ్యుకేషన్ కమిషన్ సూచనల మేరకు విద్యా వ్యవస్థను బాగుచేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. 11 వేలకు పైగా టీచర్లను భర్తీ చేశామని ఉద్ఘాటించారు. 12 యూనివర్సిటీలకు వీసీలను నియమించామని గుర్తుచేశారు. కొత్త కోర్సులను పరిచయం చేశామని తెలిపారు. పిల్లల పాఠశాలల పెంచేందుకు, ఎంఎన్‌సీ కంపెనీలు, విదేశీ యూనివర్సిటీలతో తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీలు ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. యూనివర్సిటీల్లో డిటెన్షన్, డ్రాపౌవుట్స్, మల్టీపుల్ ఎంట్రీస్, మల్టీపుల్ ఎగ్జిట్స్, కామన్ సిలబస్, అంశాలపై చర్చించేందుకు ఇదివరకే కమిటీ వేశామని

■ మిగతా 4లో..

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్..

**ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ముచ్చట్లు :**



ఛత్తీస్‌గఢ్ దండ కారణ్యం గత కొన్ని రోజులుగా తుపాకుల మోతతో దద్దరిల్లుతోంది. గత వారం జరిగిన రెండు వేర్వేరు ఎదురు కాల్పుల్లో 30 మంది మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే. తాజాగా అక్కడ మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. దంతెవాడ జిల్లాలో భద్రతాదళాల కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు.దంతెవాడ -బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో భద్రతా సిబ్బంది నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఘటనాస్థలి నుంచి నక్సలైట్ల మృతదేహాలతోపాటు తుపాకీలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు వెల్లడించారు.కాగా, ఈనెల 20వ తేదీన తుపాకుల మోతతో దండకారణ్యం రక్తసిక్తమైన విషయం తెలిసిందే. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య గురువారం జరిగిన రెండు వేర్వేరు ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు, ఒక జవాన్ మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లా పీడియా అడవుల్లో గురువారం ఉదయం నక్సల్స్, పోలీస్ వర్గాల మధ్య సుమారు నాలుగు గంటలపాటు భీకర పోరు సాగింది. ఘటనా స్థలం నుంచి 26 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దు కోరోస్‌కోడో గ్రామ సమీప అడవుల్లో జరిగిన మరో ఎదురుకాల్పుల్లో నలుగురు మావోలు మృతి చెందారు.

# ప్రాణాలు పోతుంటే పట్టించుకోరా..?




**హసన్‌పర్తి,తెలంగాణ ముచ్చట్లు.**

జాతీయ రహదారి వెడల్పు చేయాలని నిరసిస్తూ హాసన్‌పర్తిలో అర్థనగ్న ప్రదర్శన చేపట్టారు.రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసిస్తూ హాసన్ పర్తి గ్రామంలోని జాతీయ రహదారిపై వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం హాస న్‌పర్తి జాతీయ రహదారిపై ప్రాణాలు పోతే పట్టించుకోరా అని ప్రశ్నిస్తూ ఫ్లెక్సీ తో గ్రామానికి చెందిన యువజన సంఘం ఆధ్వర్యంలో అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహిం చారు. ఈ సందర్భంగా యువజన సంఘ నాయకుడు పెద్దమ్మ శ్రీనివాస్,మేకల హరి కుమార్ మాట్లాడుతూ గత కొంతకాలంగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు వల్ల అనేకమంది మృత్యువాత పడ్డారని, దీంతో అనేక కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస రోడ్డు ప్రమాదాలతో ప్రజల ప్రాణాలు కోల్పోతున్న స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక సార్లు రోడ్డు వెడల్పు విషయమై అధికారులకు, ఎమ్మెల్యేల కు వినతిపత్రం ఇచ్చిన పట్టింపు కరువైం దన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కా ర్పొరేషన్‌లో కలిసి 10 సంవత్సరాలు దాట ిన ఎర్రగట్టు గుట్ట నుండి ఎల్లాపూర్ వరకు రోడ్డు వెడల్పు చేసి డివైడర్లు ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే మున్సిపల్, ఎన్ హెచ్ అధికారులు ప్రభుత్వం స్పందించి జాతీయ రహదారి వెడల్పు చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాను న్న రోజుల్లో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాడి రాజు యాదవ్,దికొండ బిక్షపతి, ఎస్టి సుధాకర్,నలిగేటి సాంబయ్య,నల్ల కిరణ్,పెద్దమ్మ శ్రీనివాస్,సుమంత్, సాయి, పాల్గొన్నారు.

# మాదిగలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంపై ఎంహెచ్పిఎస్ ఆగ్రహం



**-మంత్రి వర్గంలో మాదిగలకు స్థానం కల్పించాలి**
**-మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

మాదిగలకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించ కుండా కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోం దని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ విమర్శిం చారు.ఈ సందర్భంగా ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ, "మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు. కానీ మాదిగలకు మంత్రి స్థానం ఇవ్వకుండా కాలయాపన చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇప్పటికైనా మాదిగల పక్షాన నిలబడి మంత్రివర్గ విస్తరణలో వారికి అవకాశం కల్పించాలి" అని డిమాండ్ చేశారు.అతి తక్కువ శాతం జనాభా ఉన్న కులాలకు ఉన్నత పదవులు దక్కుతుంటే, 12% జనాభా ఉన్న మాదిగలకు మంత్రివర్గంలో స్థానం లేకపోవడం అన్యాయం అని వ్యాఖ్యానించారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రేషన్ కార్డు లేకుండానే అమలు చేయాలి గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్నా ఒక్క రేషన్ కార్డు ఇవ్వకపోవడం వల్ల ప్రజలు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారని, అందువల్ల రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రేషన్ కార్డు అర్హత లేకుండానే అందరికీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



**- నైతిక విలువలతో కూడిన విద్య నారాయణలోనే సాధ్యం**

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం జిల్లా, సత్తుపల్లి పట్టణం విద్యార్థుల్లో పుస్తకాలు చదివే అలవాటుతో పాటు నైతిక విలువలు పెంపొందిం చాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని "తల్లికి వందనం" కార్యక్రమం నారాయణ పాఠశాలలో ఘనంగా జరిగింది. విద్యార్థులు విద్యాభివృద్ధిలోనే కాకుండా తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథి జోనల్ ఏజీఎం యోగా రాంకీ జ్యోతి ప్రజ్వలన చేసే ప్రారంభించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను సత్కరించి పాద పూజ చేసి వారి నుంచి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. ఇటువంటి కార్యక్ర




మాలు విద్యార్థులలో నైతిక విలువలు పెంచడానికి దోహద పడతాయని తల్లిదండ్రులు ప్రశంసించారు. ఈ కార్యక్ర మంలో ఆర్ఐ క్రాంతి కుమార్, జోనల్ కోఆర్డినేటర్స్ ప్రవీ



ణ్, వినోద లక్ష్మీ, నీలిమ, డీన్ రవీంద్ర, ఏవో జగదీష్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు, ప్రజలను చైతన్య పరిచే ప్రబోధాలు అర్చకులు బోధించాలి




**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం విశ్వ బ్రాహ్మణ వేదపండితులచే రూపొందించిన విశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా పంచాంగాన్ని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు, ప్రజలను చైతన్య పరిచే ప్రబోధాలు అర్చకుల నుండి రావాలని ఆయన కోరారు. అర్చకులు వల్లించే మంత్రాల యొక్క విశిష్టత, అర్థం తెలియజేసి భక్తులను సన్మార్గం వైపు మల్లించాలని ఆయన అన్నారు. ఈ తెలుగు ఉగాది నూతన సంవత్సరం జిల్లా ప్రజల జీవితాల్లో మంచి మార్పు తీసుకు రావాలని , అందరికి శుభం జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనం తరం వేదపండితులు ఎస్పీ రావుల గిరిధర్ ను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం జిల్లాఅధ్యక్షుడు నారాయణదాసు గోవర్ధనాచారి, లవకుమారాచారి, హిమ వంతాచారి, నరసి ంహాచారి, బ్రహ్మాచారి, బైరోజు చంద్రశే ఖర్, విరాట్ ఆచారి, శ్రీహరి ఆచారి, విక్రమ్ ఆచారి పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నాయకుడు సింగిరెడ్డి రాజేశ్వర్‌కు అంతిమ వీడుకోలు

**-ఎమ్మార్పీఎస్ లో కీలక పాత్ర పోషించి, ఎస్సీ వర్గీకరణలో అలుపెరుగని పోరాటం**
**-జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము చెన్న కేశవులు**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకుడు సింగిరెడ్డి రాజేశ్వర్ మాదిగ మంగళవారం గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులుతో కలిసి ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ నాయకులు రాజేశ్వర్ అంతిమయాత్రలో



పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ... తొలితరం నాయకుడు ఎమ్మార్పీఎస్‌లో కీలకపాత్ర పోషించి, జైలు గోడలను ముద్దాడిన ఎస్సీ వర్గీకరణ సాధనలో ఎన్నో ఆటుపోటులు ఆటంకాలు ఎదుర్కొని పోరాటంలో మాదిగ జాతిని ఆత్మగౌరవం హక్కుల కోసం పోరాడిన నిలిచిన ఉద్యమ నాయకుడు. ఆయన మరణం బాధాకరమైన విషయం అని అన్నారు.ఈ రోజు ఆయన సొంత గ్రామంలో పెద్దమందడి అంత్య క్రియలో పాల్గొని పూల దండలు వేసి దండోరా ఘన నివాళి అర్పించారు. జిల్లా కమిటీ తరపున పక్షాన జోహార్ జోహార్ ఘన నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లా మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, దండోరా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కార్మికుల జీతాలు పెండింగ్

**- బీఆర్ఎస్ నేత మారేపల్లి ప్రసాద్ విమర్శ**

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు :**



స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు మంజూరు కాలేదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారేపల్లి ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయంలో స్పందించిన మారేపల్లి ప్రసాద్, "కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తక్షణమే జీతాలు చెల్లించకపోతే బీఆర్ఎస్ తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే, ఎంపీలను అడ్డు కుంటామని, బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల కోసం భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## ముస్లిం ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటాం



**-తుంబురు దయాకర్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

రామన్నపేటకి సంబందించిన ముస్లిం ఖబరస్తాన్‌లో నీటి సౌకర్యం లేక చాలా ఇబ్బంది పడటం జరిగింది గతంలో ప్రస్తుతం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో మన తుంబురు దయాకర్ రెడ్డి మున్సిపాలిటీ సిబ్బందికి చెప్పి వెంటనే హ్యాండ్ బోరింగ్ ఇప్పించడం జరిగింది. ఎన్నో సంవత్సరాల నుండి ఖబరస్థాన్లో నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్న ముస్లిం ప్రజలకు ఈరోజు ఆ బాధ లేకుండా చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, తుంబురు దయాకర్ రెడ్డికి ముస్లిం ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



**- తెలంగాణ రైతు సంఘం డిమాండ్**

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

సత్తుపల్లి పట్టణం స్థానిక రావి వీర వెంకయ్య భవనంలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, దాళ్వా వరి పంట కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అంతే కాకుండా రైతుల దగ్గర నుండి ధాన్యం దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. బహుళ మార్కెట్లో ధర ఉన్నప్పటికీ రైతులకు తక్కువ ధర చేతికి వచ్చే పరిస్థితి నెలకొంది. పచ్చిగింజ ఉంది అంటూ ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.మిల్లర్లు కూడా తక్కువ రేటుకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. గత సీజన్లో జిల్లా స్థాయి అధికారులు ప్రతి మిల్లు పై సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వలన రైతులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. సీజన్ ప్రారంభం అవుతుండడం వలన అధికారులు ముందస్తుగానే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసి రైతులకు సన్న రకాల పంటలకు బోనస్ లు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం కొనుగోలు చేసిన కేంద్రాల్లో బోనస్‌లు పెండింగ్లో ఉన్నవి వెంటనే విడుదల చేయాలని, రైతుల్ని ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రావుల రాజబాబు, కొలిక పోగు సర్వేశ్వరరావు, చప్పిడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 188 కోట్ల 31 లక్షల రూపాయలతో ఖమ్మం నగర బడ్జెట్ ఆమోదం

-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- 60 డివిజన్‌లలో పన్నుల రీ-అసెస్మెంట్ సర్వే నిర్వహణకు చర్యలు
- 60 డివిజన్లను ఐదు జోన్లుగా విభజించి పాలన సాగించేందుకు ప్రణాళికలు రూపకల్పన
- ప్లాస్టిక్ రహిత ఖమ్మం నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి
- ఖమ్మం నగరం కార్పోరేషన్ బడ్జెట్ ఆమోదం సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
2025-26 ఆర్థిక సంవత్సరానికి 188 కోట్ల 31 లక్షల రూపాయలతో ఖమ్మం నగర బడ్జెట్ ఆమోదం పొందినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, నగర పాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజలతో కలిసి పాల్గొన్నారు. ఖమ్మం నగర పాలక సంస్థకు సంబంధించి 2025-2026 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, ఆదాయ, ఖర్చు వివరాలు, 2024-2025 సవరించిన బడ్జెట్ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఖమ్మం నగరపాలక సంస్థ కు 188 కోట్ల 31 లక్షల రూపాయలతో బడ్జెట్ ను ఆమోదించడం జరిగింది. ఇంటి పన్ను ద్వారా 33 కోట్ల 92 లక్షలు, సర్ చార్జ్ స్టాంప్ డ్యూటీ ద్వారా 13 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా 55 కోట్ల 90 లక్షల ఆదాయం సమకూరుతుందని బడ్జెట్‌లో అంచనా వేయడం జరిగిందని అన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ చార్జీలు, రుణాల చెల్లింపు, 10% గ్రీన్ బడ్జెట్ కలుపుకొని చార్జ్ వ్యయం క్రింద 65 కోట్ల 5లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు. ఇంజనీరింగ్ విభాగం నిర్వహణ ఖర్చు, సాధారణ పరిపాలన టౌన్ ప్లానింగ్ కు 14 కోట్ల 12 లక్షల రూపాయలు, క్యాపిటల్ ఖర్చు కు 23 కోట్ల 65లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు. ప్రణాళికేతర నిధులు, ప్రణాళిక నిధులు, ఇతర గ్రాంట్స్ ద్వారా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో వచ్చే ఆర్థిక సంవత్సరం 78 కోట్ల 72 లక్షల క్యాపిటల్ ప్రాజెక్ట్స్ ఫండ్ బడ్జెట్ అంచనాలను రూపొందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ బడ్జెట్ ప్రాథమిక లెక్కలపై లోతుగా చర్చ పెట్టడం జరిగిందని అన్నారు. ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్పోరేషన్ పరిధిలో ఆస్తి పన్ను, ఇతర పన్నులు రీ-అసెస్మెంట్ చేసి ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్పోరేషన్‌లో గతంలో ఎక్కడా లేని విధంగా వరదలు వచ్చిన సమయంలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పని చేశారని కలెక్టర్ ప్రశంసించారు. వరదలు వచ్చిన ప్రాంతాల్లో ఆస్తి పన్ను సడలింపులో సైతం పాలనావర్గం మంచి నిర్ణయం తీసుకుందని కలెక్టర్ అభినందించారు. ఎల్ఆర్ఎస్. ద్వారా కూడా కార్పోరేషన్‌కు ఆదాయం వస్తుందని, వాటిని సైతం సరిగ్గా వినియోగించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. టౌన్ ప్లానింగ్, అద్దెల ద్వారా వచ్చే ఆదాయం, పన్నుల వసూలు మొదలగు ఆదాయ మార్గాలు పెంచుకోవడం, గతం కంటే 25 శాతం ఆదాయం పెరిగిందని కలెక్టర్ తెలిపారు.



కార్పొరేషన్‌లో అధిక ప్రాధాన్యత ఎక్కడ ఉందో పాలక వర్గంలో చర్చ జరిపి ఆ పనులను మొదట చేపట్టాలని అన్నారు. డ్రైయినేజ్ ప్లాన్‌పై దృష్టి పెట్టుకోవాలని అన్నారు. ప్రాథమిక అవసరాలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ అన్నారు. పూణే నగరం వెళ్ళి అక్కడ జరుగుతున్న మంచి ప్రాక్టీసెస్ ఇక్కడ అమలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్బన్‌కు ప్రత్యేకంగా ఇద్దరు తహసిల్దార్, ముగ్గురు సర్వేయర్లు ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, నెల రోజులలో ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తుందని అన్నారు. దూరదృష్టితో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేస్తున్నామని అన్నారు. భూ గర్భ జలాలు పెంచుకునేందుకు నిర్మించే ప్రతి భవనంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ రహిత ఖమ్మం జిల్లాగా రూపుదిద్దేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా గౌరవం అందించాలని, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో తీగల వంతెన నిర్మాణానికి సంబంధించి పనులు వేగవంతం చేయడంలో భాగంగా స్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్సీల నిధులలో భాగంగా 4 కోట్లు కేటాయించాలని మంత్రి ప్రతిపాదనను అందరం ఆమోదించామని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఖమ్మం పట్టణ రూపు రేఖలు మారిపోయాయని అన్నారు. వీధి దీపాలకు అంచనా మించి ఖర్చు కావడం జరిగిందని, దీనికి గల కారణాలు రివ్యూ చేసుకోవాలని అన్నారు. నగరంలో విపరీతమైన దోమలు ఉన్నాయని, దోమల నియంత్రణకు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని అన్నారు. ప్రతి డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనుల సమాచారం సంబంధిత ప్రజా ప్రతినిధులకు తప్పనిసరిగా అందించాలని అన్నారు.

**విలీన పంచాయతీలపైనే దృష్టి..**

**– పునుకొల్లు నీరజ, మేయర్, ఖమ్మం నగర పాలక సంస్థ**

సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విలీన పంచాయతీల అభివృద్ధిపైనే దృష్టిసారించాలని సూచించారని, మంత్రి ఆదేశాలతో. విలీన పంచాయతీలకే వార్డు బడ్జెట్ అధికంగా కేటాయించామని, ఆ నిధులను ఖర్చు చేస్తామని అన్నారు. రోడ్లపై రోడ్లు నిర్మించమని, డ్రైనేజీలపై డ్రైనేజీలు కట్టమని, రోడ్లు లేని చోట రోడ్లు వేస్తామని, డ్రైనేజీలు లేని చోట డ్రైనేజీలు నిర్మిస్తామని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు వచ్చే నెల మొదటి వారంలో మరోసారి కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తా మని అన్నారు. ఆ సమావేశంలో అందరి కార్పొరేటర్ల నుండి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ కార్పోరేషన్ ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ముందుగా 43వ వార్డులో పన్నుల రీ- అసెస్మెంట్ చేయడం ద్వారా 60 లక్షల వరకు ఆదాయం పెరిగిందని, రాబోయే ఆర్థిక సంవత్సరంలో 60 వార్డులలో రీ- అసెస్మెంట్ సర్వే నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు. నగరంలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండేలా, రిజిస్ట్రేషన్ చేసుకునేలా సర్వే చేపడతామని అన్నారు. నగరంలో వాణిజ్య సంస్థలు కేవలం 7 వేలు మాత్రమే రిజిస్టర్ అయ్యాయని, క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో మరోసారి సర్వే చేపట్టడం జరుగుతుందని అన్నారు. నగరంలో 60 డివిజన్లను 5 జోన్ లుగా (నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్) విభజించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాబోయే కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధుల ముందు ఈ ప్రణాళిక ఉంచుతామని అన్నారు. ప్రతి జోన్‌లో రెవెన్యూ అధికారి, పారిశుధ్య ఇన్స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఈ టౌన్ ప్లానింగ్ ఉండేలా చూస్తామని, చిన్న చిన్న సమస్యలు జోనల్ స్థాయిలో పరిష్కరించేలా చూస్తామని అన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం 131 వాహనాలలో జిపిఎస్ ట్రాకర్, పారిశుధ్య ఇన్స్పెక్టర్లకు జిపిఎస్ వాకి టాకీలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా పారిశుధ్య నిర్వహణ మెరుగుపడిందని అన్నారు. భవిష్యత్తులో జవాన్లకు సైతం వాకి టాకీలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి డివిజన్‌కు 2 అదనపు పారిశుధ్య కార్మికులను కేటాయించడం జరుగుతుందని అన్నారు. పారిశుధ్య కార్మికులకు టర్మ్ భీమా అందించామని, రాబోయే సంవత్సరం హెల్త్ బీమా అందిరించేందుకు కృషి చేస్తామని అన్నారు. 19 నూతన ట్రాక్టర్లు, 30 ఆటోలు, 2 గడ్డి కోత యంత్రాలు , 2 డీ సిల్టింగ్ యంత్రాలు, 2 వాక్యూం యంత్రాలు కొనుగోలుకు టెండర్లు పిలిచామని అన్నారు. వారం రోజులలో రోడ్డు స్వీపింగ్ యంత్రం డెలివరీ అవుతుందని అన్నారు. ప్రతి డివిజన్ పరిధిలో అవసరమైన నూతన రోడ్లు డ్రైయిన్లు, నీటి సరఫరా లైను, వీద్యుత్ లైన్ నిర్మాణం కోసం సమగ్ర సర్వే చేపడతామని అన్నారు. అక్రమాల నిర్మూలన కోసం డిసిఎం, డిఆర్ఎఫ్‌లతో కలిసి ఒక ప్రత్యేక బృందం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అన్నారు. నగర పాలక కార్పోరేటర్ కమర్తపు మురళీ మాట్లాడుతూ నగరంలో గ్రౌండ్ ఫ్లోర్‌కు అనుమతి తీసుకొని అక్రమంగా మూడు నాలుగు ఫ్లోర్లు నిర్మిస్తున్నారని వీటికి కూడా ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. అద్దెల క్రింద మనకు వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉందని, దీనిని పెంచుకోవాలని అన్నారు. కమ్యూనిటీ హాల్స్‌ను మరమ్మత్తు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. ఖమ్మం నగరం మాస్టర్ ప్లాన్ కావాలని తెలిపారు. మాస్టర్ ప్లాన్ లేని కారణంగా 10 వేల ఇండ్ల వరకు అనుమతులు లేకుండా ఇంటి పన్ను వసూలు చేయలేక పోతున్నామని అన్నారు. ఖమ్మం కార్పొరేషన్ కు తహసిల్దార్, సర్వేయర్ ఫుల్ టైం అందుబాటులో ఉండాలని అన్నారు. నీటి బిల్లు ప్రతి ఒక్కరు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు, పాల్గొన్నారు.

# ఇంటి తలుపులు తీసుకుపోయిన మునిసిపల్ సిబ్బంది

**భూపాలపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**
మున్సిపాలిటీ సిబ్బంది అక్రమంగా తీసుకొని పోయిన తమ ఇంటి తలుపులను తమకు ఇవ్వకుంటే కలెక్టర్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11 వ వార్డు పెద్ద కుంటపల్లి తండాకు చెందిన వాంకుడోత్ హునా నాయక్ అన్నారు. పెద్ద కుంటపల్లిలో తాము గత 30 ఏళ్ల క్రితం ములుగు జిల్లాలోని రామచంద్రపురం నుండి బ్రతుకుతెరువు కోసం పెద్ద కుంటపల్లికి వచ్చి, మేకల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానన్నారు. 30 ఏళ్ల నుండి ఇప్పటివరకు ఏ అధికారి వచ్చి కూడ తమను ఇంటి పన్ను అడగలేదన్నారు. మున్సిపాలిటీ అధికారులు వాంకుడోతు హునా నాయక్ పేరు మీద రూ. 20వేల ఇంటి పన్ను ఉన్నదని, ఇందులో రూ. 5,500 కడితే చాలని, మిగతావి మరో 6 నెలల తర్వాత కట్టవచ్చని చెప్పారన్నారు. వెంటనే నేను అప్పు తెచ్చి రూ. 5,500 కట్టానన్నారు. ఆ తర్వాత వచ్చి ఇంకా రూ. 15 వేల ఇంటి పన్ను ఉన్నదని, ఈ పన్ను కట్టకుంటే ఇంట్లో సామాన్లు జప్తు చేసుకుంటామని చెప్పి, వెంటనే పదిమంది తన ఇంట్లోకి వెళ్లి ఇంట్లో ఉన్న బియ్యం, ఇతర పాత్రలు కింద పారబోసి, తమ ఇంటి తలుపును తీసుకొని వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క రోజు కూడా మున్సిపాలిటీ అధికారులు వచ్చి తాను మున్సిపాలిటీకి ఇంటి పన్ను బాకీ ఉన్నానని చెప్పలేదని, కనీసం ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు.



# మిర్చి రైతులను కేంద్రం ఆదుకోవాలి

-సబ్సిడీ రుణాలు అందించి, నకిలీ విత్తనాల విక్రయాలను నియంత్రించాలి
- లోక్ సభలో 377 నిబంధన కింద కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల మంత్రిని కోరిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో మిరప పంట అత్యధికంగా సాగవుతోందని.. అయితే రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. ఈ మేరకు 377 నిబంధన కింద మిర్చి రైతుల పక్షాన పలు అంశాలను ప్రస్తావించారు.ఆ వివరాలు ఇలా..

– దేశంలో మిర్చి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రభాగంలో ఉంది. గతేడాది 12.43 లక్షల హెక్టార్లలో మిర్చి సాగు చేయగా 48.29 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఖమ్మం, వరంగల్ మరియు మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా సాగవుతోంది.

– తెల్లదోమ, విల్ట్ మరియు ఆకు ముడత వంటి తెగుళ్లతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం అధిక ఖర్చులతో ఆర్థికంగా దెబ్బతింటున్నారు. మార్కెట్ హెచ్చుతగ్గులు, మధ్యవర్తుల దోపిడీతో నష్టపోతున్నారు.

– వర్షాభావం, సరైన నీటిపారుదల సదుపాయం లేక, కల్తీ విత్తనాలు, కార్మికుల కొరత, అధిక వ్యయంతో రైతులపై ప్రభావం పడి.. అప్పుల పాలవుతున్నారు.

– కేంద్ర ప్రభుత్వం స్పందించి..చీడపీడల నియంత్రణ చర్యలు చేపట్టి, సబ్సిడీలు అందించడం, మద్దతు ధర కల్పించడం, నిల్వ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, తక్కువ వడ్డీకి రుణాలు అందించడం.. వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.

# పాఠకులకు అవసరమైన వసతుల కల్పనకు కృషి





-పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో పెట్టాలి
-జిల్లా గ్రంధాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
పాఠకులకు జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో అవసరమైన వసతుల కల్పనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఉన్న ఆర్.ఓ. వాటర్ ప్లాంట్, టాయిలెట్స్, నూతనంగా నిర్మించిన ప్రహరీగోడ ను పరిశీలించారు. ఆవరణ మొత్తం చదును చేయాలని అన్నారు. మొక్కలను పెంచాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న పాఠకులతో, పోటీ పరీక్షలకు సిద్దం అవుతున్న అభ్యర్థులతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముచ్చటించారు. ఏ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు, ఎటువంటి పుస్తకాలు కావాలో వివరాలు అందిస్తే పది రోజుల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పోటీ పరీక్షలకు సంబంధించి ప్రతి సంవత్సరం అప్ డేట్ అయిన పుస్తకాలను ఉంచాలని, ఎప్పటికప్పుడు పాతవి మార్చాలని, పాఠకులు యువకులతో చర్చించి పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు ప్రతి విభాగం వారీగా అవసరమైన పుస్తకాల జాబితాను తయారు చేసి వెంటనే అందించాలని కలెక్టర్ గ్రంథాలయ నిర్వాహకులకు సూచించారు. గ్రంథాలయంలో ఈ- లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన కంప్యూటర్లు, హెడ్ సెట్ లను అందిస్తామని, ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. లైబ్రరీలో పాఠకులందరికీ 15 రోజులలో ఐడి కార్డులు అందించాలని కలెక్టర్ సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించుకున్న తర్వాత ఇతరులకు సహాయం చేయాలనే దృక్పథం ఉండాలని కలెక్టర్ తెలిపారు. మరో నలుగురికి సహాయం చేసినప్పుడు వచ్చే సంతృప్తి అధికంగా ఉంటుందని అన్నారు. సమాజంలో మనం కోరుకునే మార్పు సాధనకు మనం కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ లైబ్రరీ పరిశీలన సందర్భంగా లైబ్రరీ కార్యదర్శి వి. అర్జున్, లైబ్రరీయన్ లు కె. రవిబాబు, బి. బాబు రావు, క్లర్క్ విజయ్ భాస్కర్, పాఠకులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# ముస్లింలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం





**- మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.**

**- వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు.**

**హసన్‌పర్తి, తెలంగాణ ముచ్చట్లు :**

హసన్‌పర్తి మండల పరిధిలోని కెఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దావత్ - ఏ - ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథులుగా కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, హనుమకొండ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవతా విలువలతో మనిషి మహోన్నతుడిగా మారాలన్నదే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం అని అన్నారు. తమ జీవిత సౌదాల్ని సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద నిర్మింపజేసుకునేందుకు ఉపయోగపడే సాధనమే ఉపవాస వ్రతమని మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సెక్యులర్ పార్టీ అన్నారు. గంగా జమున తెహాజీబ్ మన సంస్కృతిలో ఒక భాగమని పండుగలు ఏమైనా అందరం కలిసికట్టుగా చేసుకుంటేనే బాగుం టుందన్నారు. 30 రోజుల పాటు ఉపవాస దీక్షను చేస్తున్న ముస్లిం సోదరులకు శుభాకాం క్షలు తెలిపారు. అనంతరం సామూహిక నమా జ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ఫింగిలి వెంకట్రామి రెడ్డి, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మనీ శేకర్ రావు, ఆత్మకూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పినింటి అనిల్ రావు, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, కార్పొరేటర్లు వరుణ గంటి అరుణ కుమారి, జక్కుల రజిత, ఎస్సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, మాజీ మండల అధ్యక్షుడు మేడిపల్లి మదన్ గౌడ్, జిల్లా మైనారిటీ నాయకులు మహమ్మద్ చోటే, సయ్యద్ ఇంతియాజ్, హసన్‌పర్తి మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ అన్వర్ ఖాన్, సయ్యద్ జలీల్, మొహమ్మద్ అఫ్జల్, సయ్యద్ సలీం పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను బాగుచేస్తాం

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. కమిటీ నివేదిక వచ్చాక అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. త్వరలో ఫీజు రెగ్యులేటరీ కమిటీని నియమిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## బెట్టింగ్ యాప్స్ కేసులో హైకోర్టును ఆశ్రయించిన విష్ణుప్రియ

మొదటిపేజీ తరువాయి

నమోదైన బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో ఇప్పటికే 11 మందిని నిందితులుగా చేర్చారు పోలీసులు. వారందరికీ కూడా వ్యక్తిగతంగా నోటీసులు జారీ చేశారు. రోజువారి విచారణలో భాగంగా ముగ్గురు ముగ్గురు చొప్పున విచారణకు రావాలని ఆదేశించినప్పటికీ కేవలం ఇద్దరు మాత్రమే విచారణకు హాజరయ్యారు.

## ఏఐసిసి డ్రాఫ్టింగ్ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు..



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

మార్చ్ 24 న ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కె. సి.వేణుగోపాల్‌లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) డ్రాఫ్టింగ్ కమిటీనీ ప్రకటించారు. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు కల్పించారు. ఈ కమిటీ ఏప్రిల్ 8 మరియు 9 తేదీలలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరగనున్న ఏఐసీసీ కీలక సమావేశాల కోసం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ యొక్క భవిష్యత్తు వ్యూహాలు, విధానాలు, మరియు రాజకీయ నిర్ణయాలను రూపొందించడంలో డ్రాఫ్టింగ్ కమిటీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇందులో భట్టి విక్రమార్కకు చోటు దక్కడం ఆయన రాజకీయ నైపుణ్యం, అనుభవం,పార్టీ పట్ల నిబద్ధతకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఏప్రిల్ 8న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరగనుంది, ఆ తర్వాత ఏప్రిల్ 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించబడుతుంది. ఈ సమావేశాలు గత ఏడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన "నవ సత్యాగ్రహం" సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఉంటాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ సమావేశాల్లో పార్టీ యొక్క రాజకీయ మేనిఫెస్టో, సంస్థాగత మార్పులు, మరియు రాబోయే ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలను చర్చించి ఖరారు చేయడానికి డ్రాఫ్టింగ్ కమిటీ కీలక పాత్ర వహిస్తుంది. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా పనిచేస్తున్నారు ఆయన రాజకీయ అనుభవం,నాయకత్వ పటిమ ఆయనను డ్రాఫ్టింగ్ కమిటీలో చేర్చడానికి ఒక ప్రధాన కారణం. 2023లో తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో భట్టి విక్రమార్క ముఖ్య పాత్ర పోషించారు. నాటి ప్రతిపక్ష పార్టీని ఎండగట్టడంలో ఆయన చేసిన పీపుల్స్ మార్చ్ కేడర్ లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఝూరండ్ శాసనసభ ఎన్నికలు 2024లో ఇండియా కూటమి విజయం సాధించడంలో తెలంగాణ ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషించారు.



## బండనగరంలో బాట పంచాయితీ సమస్య పరిష్కారం

**-తహసిల్దార్ ప్రకాష్ రావు చొరవ**

**బచ్చన్నపేట,తెలంగాణ ముచ్చట్లు:**

బండనగరం గ్రామంలో దాదాపు 100 సంవత్సరాలుగా ఉపయోగంలో ఉన్న బాటకు రైతు సిద్ధులు ముళ్ళ కంప వేయడంతో గ్రామస్థులు ఎదుర్కొన్న సమస్యకు స్వస్తి పలికింది. సోమవారం ప్రజావాణిలో గ్రామస్థులు దరఖాస్తు చేయగా, మంగళవారం బచ్చన్నపేట తాసిల్దార్ ప్రకాష్ రావు పంచాయితీ సెక్రెటరీతో కలిసి గ్రామానికి వెళ్లి సమస్యను పరిష్కరించారు. తహసిల్దార్ ప్రకాష్ రావు రైతు సిద్ధులతో పాటు గ్రామస్థులతో చర్చలు జరిపి, బాటపై వేసిన ముళ్ళ కంపను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ ముళ్ళ కంప వల్ల గ్రామంలోని 7 ముస్లిం కుటుంబాలకు చెందిన పిల్లలు స్కూల్‌కు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, సిద్ధులతో మాట్లాడిన తాసిల్దార్, సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), గ్రామ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. "గ్రామస్థుల సమస్యలను విని, వాటిని త్వరితగతిన పరిష్కరించడమే మా బాధ్యత" అని తాసిల్దార్ ప్రకాష్ రావు తెలిపారు.

## పుట్టుచీర కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

హైదరాబాద్ కొండాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళ వారం జరిగిన పెద్దమందడి మండలం మనగిల్ల గ్రామానికి చెందిన మంగలి వెంకట్రాములు మనవరాలు యశస్విని పట్టుచీర కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. పిల్లల జీవితాల్లో ముఖ్యమైన రోజులను ఈ విధంగా నిర్వహించుకోవడం శుభసూచకమని, ఇలాంటి ఆనందాలు వారి భవిష్యత్తులో మరుపురాని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మనిగిళ్ల గ్రామ సర్పంచ్ సరితా తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమల మహేష్, ఆర్యభవన్ శ్రీను, చీర్ల శేఖర్, గ్రామస్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములు అందించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపిన దయానంద్







**సత్తుపల్లి,ఆర్‌సి,తెలంగాణ ముచ్చట్లు**

వేంసూరు మండలం, కల్లూరుగూడెం గ్రామం లో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములు అందించిన రైతులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. దయానంద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మరియు సత్తుపల్లి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కృషితో ఈ నూతన పామాయిల్ ఫ్యాక్టరీ మన సత్తుపల్లి నియోజకవర్గానికి తీసుకు రావడం జరిగింది. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం వలన వేంసూరు మండలం మరియు కల్లూరు గూడెం గ్రామం ఎంతో అభివృద్ధి జరుగుతుందని, ముఖ్యంగా రైతు సోదరులకు ఈ పామాయిల్ ఫ్యాక్టరీ ఓ గొప్ప వరం అని అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నూతన టెక్నాలజీతో నిర్మించడం జరుగుతుందని ఎటువంటి కాలుష్యం వాటిల్ల దని తెలిపారు. అలాగే ఫ్యాక్టరీ నిర్మించడం వలన స్థానిక నిరుద్యోగులకు, నాన్ టెక్నికల్ ఉద్యోగ అవకాశాలు లభిస్తా యని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియో జకవర్గ ఏఎంసి చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ అధికారులు, సత్తుపల్లి నియోజ కవర్గం కాంగ్రెస్ నాయకులు,వేంసూరు మండలం, కల్లూరు గూడెం గ్రామం రైతులు పాల్గొన్నారు.

## ప్రజల్లో గౌరవం పెంచేలా నిజాయితీగా పనిచేయాలి



**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు:**

పోలీసుల పట్ల ప్రజల్లో గౌరవం, మర్యాదలు పెంపొందించే విధంగా నిజాయితీతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. మంగళవారం ఉదయం ఆయన తొలిసారిగా ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, అక్కడి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి కీలక సూచనలు చేశారు.

**ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ సందర్శన**

సన్‌ప్రీత్ సింగ్ ఉదయం ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో అడుగుపెట్టి, ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆ తర్వాత స్టేషన్‌లోని సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. వివిధ రికార్డు గదులను పరీక్షించడంతో పాటు, స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సంతోష్‌తో మాట్లాడిన ఆయన, స్టేషన్ పరిధిలో జరిగే నేరాల వివరాలు, రౌడీ షీటర్ల సంఖ్య, రోడ్డు ప్రమాదాల గణాంకాలు, స్టేషన్ సిబ్బంది సామర్థ్యం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. సందర్శన సమయంలో సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, "పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా నిజాయితీగా పనిచేయాలి. ఫిర్యాదులపై వేగంగా స్పందించడంతో పాటు, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు. ముఖ్యంగా స్టేషన్ పరిధిలోని వరంగల్-భూపాలపట్నం ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్శనలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏసీపీ సతీష్‌బాబు ఆయనతో పాల్గొన్నారు.

**కంఠాత్మకూర్ చెక్‌పోస్ట్ పరిశీలన**

అదే రోజు, సన్‌ప్రీత్ సింగ్ ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను కూడా సందర్శించారు. అక్రమ ఇసుక రవాణాను నియంత్రించేందుకు స్థాపించిన ఈ చెక్‌పోస్ట్‌లో సిబ్బంది విధులను పరిశీలించారు. రోజూ తనిఖీ చేసే వాహనాల సంఖ్య, అనుమతులతో కూడిన ఇసుక వాహనాల తనిఖీ విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## కడియంకు కలసి రాని .. కాలం..!

మొదటిపేజీ తరువాయి

ఇందిర వర్గీయులకి నామినేటెడ్ పదవులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కమిటీలలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారంట. అయితే ఆ హామీలేవి ఇంతకాలం అమలు కాకపోతుండటంతో ఇందిర వర్గీయులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు స్టేషన్ ఘన్పూర్‌లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇందిరకు కనీసం సమాచారం కూడా లేకపోవడంతో ఆమె కూడా అసంతృప్తితో కనిపిస్తున్నారు. కడియం కాంగ్రెస్‌లో చేరే సమయంలో పార్టీలో ఇందిరకి సమూచిత స్థానం కల్పించడానికి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని కాంగ్రెస్ నాయకత్వం హామీ ఇచ్చి.. పార్లమెంట్ ఎన్నికల్లో పని చేయించుకుందంట. ఇప్పటివరకు ఆమెకి ఎలాంటి పదవి రాకపోగా స్టేషన్ ఘన్పూర్‌లో తన వర్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందననే ఆవేదనలో ఆమె ఉన్నారట. సీఎం సభ సందర్భంగా కూడా కడియం శ్రీహరి ఆమెను నిర్లక్ష్యం చేయడం వల్లే ఆవిడ ఆ సభకి దూరంగా ఉన్నారని ఇందిర వర్గం బహిరంగంగానే చెబుతుంది. మొక్కుబడి సమాచారం మాత్రమే ఇచ్చి ఇందిరని కనీసం సభకు రాకుండా కడియం శ్రీహరి ఎత్తులు వేశారని ఇందిర వర్గం ఆగ్రహంతో ఉన్నారట. సభకి ఒకరోజు ముందు ఇందిర తన ముఖ్య అనుచరులతో మంతనాలు జరిపి కడియం శ్రీహరి పిలవకపోయినా స్టేషన్ ఘన్పూర్‌లో సీఎం పాల్గొనే సభకి హాజరైతే ఎలా ఉంటుందని సమాలోచనలు జరిపారంట. అయితే కడియం శ్రీహరి వ్యవహార శైలి అధిష్టానానికి తెలిసేందుకైనా ఈ సభకు వెళ్లకూడదని డుమ్మా కొట్టారని ఇందిర వర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కడియం శ్రీహరి తీరుతో తీవ్ర అసంతృప్తిగా ఉన్న సింగపురం ఇందిర, ఏఐసీసీ పెద్దల వద్ద తన గోడు వెల్లబోసుకునేందుకు సిద్ధమవుతున్నారట. గత ఎన్నికల్లోను ఏఐసీసీ పెద్దల అండతోనే సింగపురం ఇందిరా టికెట్ తెచ్చుకున్నారని.. ఆ స్థాయిలో ప్రభావం చూపగల సత్తా ఇందిరకు ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆ క్రమంలో ఇన్ని రోజులు కడియం శ్రీహరి తీరును లైట్‌గా తీసుకున్న ఇందిరా అమితుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారట. 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడితే, తనను పక్కన పెడుతున్నారన్న ఆవేదనతో.. ఏఐసిసి పెద్దల వద్దే తన విషయం తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారని ఇందిర అనుచరులు చెప్పుకుంటున్నారు. దాంతో ఇందిర ఏం చేయబోతుందోనని, కడియం వర్గీయులు ఆందోళన చెందుతున్నారు. కడియం శ్రీహరి సైతం ఏం జరుగుతుందో అని అయోమయంలో పడ్డారట..?

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# రాముడు నడయాడిన భద్రాద్రికి కొత్త శోభ

- దక్షిణ అయోధ్య భద్రాద్రి అభివృద్ధికి అడుగులు
- టెంపుల్ సిటీగా భద్రాద్రి రామాలయం
- భూ సేకరణకు కాంగ్రెస్ సర్కారు గ్రీన్ సిగ్నల్
- మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో సీఎం అంగీకారం
- భూసేకరణకు 34 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- సీఎం రేవంత్‌కు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామయ్య ఆలయం నూతన శోభ సంతరించుకోనుంది. శ్రీరామనవమి సీతారామ కళ్యాణం నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవతో కాంగ్రెస్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి రామయ్య ఆలయ అభివృద్ధికి పూనుకుంది. భద్రాద్రి రామయ్య అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న భూ సేకరణకు కాంగ్రెస్ సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భద్రాద్రి ఆలయ భూ సేకరణ సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకు వెళ్లగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూ 34 కోట్లు నిధులను విరుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రామ నవమి కి దక్షిణ అయోధ్య టెంపుల్ సిటీకి అడుగులు పడనున్నాయి.

**అడిగిందే తడవుగా ....**

ఆదివారం రోజున ఆలయ ఈ ఓ మరియు పండితులు గౌరవ ముఖ్య మంత్రి ని కలిసి భద్రాచల సీతారామచంద్రస్వామి శ్రీరామనవమి వేడుకలకు ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల గతంలో భద్రాద్రి ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు వివరించారు. అభివృద్ధి పనులకు భూసేకరణ అడ్డంకిగా మారిందని తుమ్మల సీఎంకు వివరించారు. భూసేకరణ పనులు పూర్తి చేస్తే భద్రాద్రి ఆలయ అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండదని భద్రాద్రి ఆలయం భక్తులతో మరింత శోభిల్లుతోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మంత్రి తుమ్మల చొరవతో సీఎం రేవంత్ రెడ్డి భూసేకరణకు కావలసిన నిధులను మరుసటి రోజు విడుదల చేసి ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. భద్రాద్రి ఆలయ అభివృద్ధికి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**నవ భద్రాద్రి...**

భారతదేశానికి తలమానికంగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యకు ఎట్టకేలకు మంత్రి తుమ్మల పరిష్కారం చూపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నవ భద్రాద్రి దిశగా తుమ్మల కృషి చేస్తున్నారు. భూ సేకరణ తరువాయి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దక్షిణ అయోధ్యగా భద్రాద్రి ఆలయ కీర్తి ధ్వనించేలా అభివృద్ధి చేయనున్నారు.

**నమూనాలు సిద్ధం...**

శ్రీరామచంద్రుడి ఆలయ అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణలో భద్రాద్రి ఆలయం నూతన శోభ సంతరించుకొనుంది. ఆగమ పండితులు రూపొందించిన నమూనాలు మరియు సూచనల ప్రకారం అభివృద్ధి పనులను ప్రారంభించాలి అని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. శరవేగంగా భూసేకరణ పనులు పూర్తిచేయాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన షాపులు, ఇల్లు షిఫ్టింగ్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. శ్రీరామనవమి వేడుకలు అనంతరం నమూనాల ప్రకారం అత్యద్భుతంగా భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. దీనితో రాష్ట్ర ప్రజల కల సాకారం కానుంది

# విద్యాశాఖ మంత్రిని నియమించాలి: ఏబీఎస్ఎఫ్



**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :** కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ వద్ద ఏబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రములో విద్యార్థి నిరుద్యోగ యువత మద్దతుతో గెలిచినా కాంగ్రెస్ పార్టీ తెలంగాణా రాష్ట్రనీకి విద్యాశాఖ మంత్రినీ కేటాయించకపోవడం బాధాకరం అన్నారు విద్యార్థుల సమస్యలు చెప్పుకోవడానికి రాష్ట్రములో విద్యాశాఖ మంత్రినీ కేటాయించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం అయ్యింది కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షములో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థి నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తాము అని హామీ ఇచ్చిందన్నారు. విద్యార్థి నిరుద్యోగ యువత కాంగ్రెస్ పార్టీనీ నమ్మి ఓట్లు వేయడంతో తెలంగాణా రాష్ట్రములో అధికారంలోకి వచ్చిందన్నారు. విద్యార్థులకు న్యాయం చేయడంలో విఫలం అయ్యిందని అన్నారు ఇప్పటి వరకు రాష్ట్రములో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం అయ్యిందని అన్నారు విద్యారంగానికి తీవ్రంగా అన్యాయం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకె దక్కుతుందని అన్నారు ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రినీ నియమించి విద్యార్థులకు న్యాయం చేయకుంటే జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తాము అని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏబిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధార సురేష్ యూనివర్సిటీ నాయకులు సందీప్ దిలీప్ మహేష్ రాంబాబు భద్రన్న సాయి కిరణ్ పాల్గొన్నారు.

# ప్రాణాలు పోతున్న పట్టించుకోరా.. యువకుల అర్ధనగ్న ప్రదర్శన




**హన్మకొండ, తెలంగాణముచ్చట్లు :** రోడ్డు ప్రమా దంలో మా ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం పట్టించు కోదా అని హసన్‌పర్తిలోని జాతీయ రహదారిపై స్థానికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం గ్రామానికి చెందిన యువజన సంఘం నాయకులు పెద్దమ్మ శ్రీనివాస్, మేకల హరి కుమార్ మాట్లాడుతూ.. గత కొంత కాలంగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు వల్ల అనేకమంది మృత్యువాత పడ్డారని, దీంతో అనేక కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస రోడ్డు ప్రమాదాలతో ప్రజల ప్రాణాలు కోల్పోతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక సార్లు రోడ్డు వెడల్పు విషయమై అధికారులకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇచ్చిన పట్టింపు కరువైందన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిసి 10 సంవత్సరాలు దాటిన ఎర్రగట్టు గుట్ట నుండి ఎల్లాపూర్ వరకు రోడ్డు వెడల్పు వేసి డివైడర్ను ఏర్పాటు చేయలేద న్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు ఎన్ హెచ్ అధికారులు ప్రభుత్వం స్పందించి జాతీయ రహదారి వెడల్పు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రానున్న రోజుల్లో ఉద్యమం ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దాడి రాజు యాదవ్ దికొండ బిక్షపతి, ఎస్టి సుధాకర్, నలిగేటి సాంబయ్య, నల్ల కిరణ్, పెద్దమ్మ శ్రీనివాస్, పెద్దమ్మ సుమంత్ వేల్పుల సాయి,పెద్దమ్మ క్రాంతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు పక్కా ఇండ్లు పంపిణీ చేయాలి



**దామెర, తెలంగాణ ముచ్చట్లు:** అర్హులైన పేదలం దరికీ పక్క ఇండ్లు పంపిణీ చేయాలని భారతీయ జనతా పార్టీ బిజెపి మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కల్పనకి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు పక్క ఇండ్లు పంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల అర్హులైన లబ్ధిదారులందరికీ పక్క ఇండ్లు పంపిణీ చేసి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దామెర మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరామ్ రెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ పిఎసిఎస్ డైరెక్టర్ మాదారపు రతన్ కుమార్, ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేవైఎం జిల్లా కోశాధికారి సూర చంద్రర్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ కొట్టే రమేష్, కో కన్వీనర్ గండు ముఖేష్, సీనియర్ నాయకులు గువ్వ సాంబయ్య, ఆలేటి పోషాలు, దామెర పృథ్వీరాజ్, శక్తి కేంద్ర ఇన్చార్జ్ లు ఎక్కలదేవి రమేష్, గోగుల సమ్మిరెడ్డి, గండు పరుశురాం, బి.రమేష్, చెల్పూరి రాజు, పాల్గొన్నారు.

## కేయూ పార్ట్ టైం లెక్చరర్స్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :** కాకతీయ యూనివర్సిటీ పార్ట్ టైం నోటిఫికేషన్ రిక్రూట్మెంట్ చేసుకోవడానికి గవర్నమెంట్ వెంటనే పర్మిషన్ ఇవ్వాలని, కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు, కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని గ్రంథా లయ ఆవరణలో విద్యార్థి సంఘాలు, కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ డాక్టర్ వడ్డేపల్లి మధు, భారతీయ రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు పాల మాకుల కొమురయ్య, మద్దిరాల మోహన్ రెడ్డి, మహమ్మద్ పాషా మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాల నుండి కాకతీయ యూనివర్సిటీలో పార్ట్ టైం నోటిఫికేషన్ లేదు, దీనివల్ల కాకతీయ యూనివర్సిటీకి ఎన్నో ఆశయాలతోటి లక్ష్యాలు తోటి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నిరాశ ఎదురవు తుంది, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించ డంలో యూనివర్సిటీ అధికారులు విఫలమయ్యా రన్నారు. విద్యార్థుల నుండి డిపార్ట్మెంటల్ ఫీజు మెస్ ఫీజు హాస్టల్ ఫీజు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు కానీ వారికి నాణ్యమైనటువంటి విద్యను అందించడం లేదు, విద్యార్థులు రోడ్లమీదకి వచ్చి పాఠాలు బోధించాలని గొడవ చేస్తున్నారు, ఒకప్పుడు కాకతీయ యూనివర్సిటీలో 400 మంది ప్రొఫెసర్ ఉండేవారు, కానీ ఇప్పుడు 72 మంది మాత్రమే ఉన్నారు, చాలామంది ప్రొఫెసర్స్ రిటైర్ అయ్యారు, మిగతా ప్రొఫెసర్ నామినేటెడ్ పదవుల వలన వారికి పాఠాలు బోధించడానికి సమయం ఉండదం లేదు, కావున విద్యార్థుల భవిష్యత్తును కాకతీయ యూనివర్సిటీని అభివృద్ధిని దృష్టిలో ఉంచు కొని పార్ట్ టైం రిక్రూట్మెంట్ చేసుకోవడానికి, వెంటనే పర్మిషన్ ఇవ్వాలని అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రతాపరెడ్డి కూడా నిత్యం నిర్లక్ష్యం వహిస్తూ, గడిచిన ఆరు నెలల నుండి చేసిన అభివృద్ధి కూడా ఏమీ లేదు. ఇదే నిర్లక్ష్యం వహిస్తే యూనివర్సిటీ అభివృద్ధిలో మరో పదేళ్లు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు స్థానిక మంత్రులు కొండా సురేఖ, ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెంటనే స్పందించి నోటిఫికేషన్ రిక్రూమెంట్ చేసుకోవడానికి పర్మిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాకతీయ యూనివర్సిటీలోని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని, కాకతీయ యూనివర్సిటీ పరిపాలనను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ రాష్ట్ర సమితి హన్మకొండ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్, డాక్టర్ వంగ మల్లేష్ గౌడ్, డాక్టర్ ఉర్సు రాజేందర్, అనిల్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటు ముట్టడిలో పాల్గొన్న నాయకులు

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు :** జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడిలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కార్తీక్ మరియు హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌరం రాహుల్ వర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్వల కార్తీక్ మాట్లాడుతూ బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి దేశవ్యాప్తంగా నిరుద్యోగం లేకుండా చేయాలన్నారు. హామీ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యువకులకు అన్యాయం చేశాడని అన్నారు. నరేంద్ర మోడీ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు.

## పుల్లా శ్రీనివాస్‌కు ఉద్యోగ సంఘం నాయకుల సన్మానం

**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :** కాకతీయ యూనివర్సిటీ సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా హ్యాట్రిక్ సాధించిన డాక్టర్ వుల్లా శ్రీనివాస్ సేవలు అమోఘమని కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్. సుజాత అన్నారు. మంగళవారం కేయూ బయోటెక్నాలజీ విభాగంలో వర్సిటీ సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా వరసుగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన డాక్టర్ వుల్లా శ్రీనివాస్‌ను పుష్పగుచ్ఛం, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీగా, ఆల్ ఇండియా వర్సిటీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సంక్షేమ కోసం పాటుపడుతున్న డాక్టర్ వుల్లా శ్రీనివాస్ కృషిని కొనియాడారు. భవిష్యత్లోనూ వర్సిటీతో పాటు ఇతర వర్గాల ఉద్యోగులు, ప్రజల సంక్షేమం కోసం వుల్లా శ్రీనివాస్ పాటుపడదుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేయూ ఇంజనీరింగ్ కళాశాల సూవరింటెండెంట్ బోల్లేపాక ప్రభాకర్, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్ , బొక్క మొగిలి, గాదె సుమన్, మహర్షి, ఇంద విజయ రావు, శోభన్ బాబు, మంద శ్యాం, రణధీర్, సాగర్ పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

**సిద్దిపేట, తెలంగాణ ముచ్చట్లు :** సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ చేతుల మీదుగా సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బందెల కనకయ్యకి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా నియోజకవర్గ ఇం చార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కు కృషి చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు వివరించాలని కోరారు.

# గంజాయి నియంత్రణ పై పటిష్టమైన నిఘా ఉంచాలి

**-చట్టబద్ధంగా మంచిగా పని చేసినప్పుడు తప్పక గుర్తింపు వస్తుంది**

**పెద్దపల్లి - తెలంగాణ ముచ్చట్లు :**

గంజాయి నియంత్రణపై పటిష్టమైన నిఘా ఉంచాలని సీపీ అంబర్ కిషోర్ ఝా పోలీసులకు సూచించారు .నెలవారి సమీక్షలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా . సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్క పోలీస్ అధికారి చట్టబద్ధంగా పనిచేయాలని మంచిగా పని చేసినప్పుడు తప్పక గుర్తింపు వస్తుందన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యకలాపాలపై స్టేషన్ అధికారులకు ముందస్తు సమాచారం వుండాలని, ప్రతి కేసులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి, ఎస్సీ , ఎస్టీ కేసులలో న్యాయపరంగా పారదర్శకంగా విచారణ జరపాలి. ప్రతి పోలీస్ స్టేషన్లో అధికారులకు సిబ్బందికి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని రకాల సమాచారం పై అవగాహనా ఉండాలి. విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలనీ, సీసీ కెమెరాలు జరిగే విషయాలను గుర్తించడం జరుగుతుందని అదే ప్రజలతో మంచి సత్సంబంధాలను కొనసాగిస్తే బయట చర్చ జరిగే ప్రతి ముందస్తు సమాచారం తెలుస్తుందని అన్నారు. దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుంటూ, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ప్రధాన చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతో పాటు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోవాలని సూచించారు .ప్రతి రోజు ఒక రెండు గంటల పాటు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు, బాధితులకు కేటాయించాలి, రెండు గంటలు పెండింగ్ కేసులను సమీక్షా జరపాలని, ఏదైనా సంఘటన జరిగినప్పుడు,

బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు సంఘటన స్థలానికి తప్పనిసరిగా వెళ్ళాలి. అప్పుడు క్షేత్రస్థాయిలో సమాచారం లభిస్తుంది అన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో విలేజ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలి. కిందిస్థాయి సిబ్బందితో మర్యాదగా ఏలాంటి భేదాలు లేకుండా ప్రవర్తించాలి. పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా



ప్రవర్తించినట్లయితే శాఖ పరమైన చర్యలు తప్పవు అన్నారు. గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని రవాణా చేసే వారిని గుర్తించాలి కేసులు నమోదు చేయాలి, గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలనీ ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం గంజాయి స్వాధీనం కేసులలో ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి సీపీ చేతుల మీదుగా రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ ,పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, పెద్దపెల్లి ఏసీపీ జి కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏసీపీ మల్లారెడ్డి, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీఐలు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్‌లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.



**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**

లక్ష్య సాధనకు ఏకాగ్రత, పట్టుదలతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ ను జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమై స్టడీ సర్కిల్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టడీ సర్కిల్ లోని విద్యార్థుల డార్మెట్రీ, లైబ్రరీ, డైనింగ్ హాల్, వంట గది కలెక్టర్ పరిశీలించారు. స్టడీ సర్కిల్ ఉద్యోగార్థులకు 75 రోజుల పాటు చేపట్టిన ఉచిత శిక్షణా తరగతులకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి సారి పోటీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అనుసరించాల్సిన వ్యూహాన్ని గురించి కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎప్పుడు శ్రమపై దృష్టి పెట్టాలని, ఖచ్చితంగా ఫలితం వస్తుందని తెలిపారు. సిలబస్‌ను అనుసరించాలని కలెక్టర్ అన్నారు. ఒకరినొకరు సహకరించుకోవాలని, తమకు తెలిసిన విషయాలు ఒకరినొకరు పంచుకోవాలని ఆమె అన్నారు. ఇంటిని, చదువును బ్యాలన్స్ చేసుకోవాలన్నారు. నిరాశ, నిస్పృహలకు లోనుకా వద్దని, ఆశావాహ దృక్పథంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వ ఉద్యోగాల సాధిన 3, 6 నెలలలో పూర్తయ్యేవి కావని, నిరంతర ప్రక్రియగా సిద్ధమయి ఉండాలన్నారు. మొదటి సారి సాధించలేక పోయిన రెండవ, మూడవ సారి ప్రయత్నం చేస్తూనే ఉండాలని అన్నారు. 75 రోజుల పాటు శిక్షణ పూర్తయినప్పటికి స్టడీ సర్కిల్ శిక్షణ సిబ్బందితో ఎల్లప్పుడు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని, నోటిఫికేషన్‌లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండానలన్నారు. శిక్షణ కేంద్రం నుండి తమ తమ ఇండ్లకు వెల్లినప్పటికి బ్యాచ్‌లో ఉన్న విద్యార్డులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అప్‌డేట్ సమాచారం అందించడం జరుగుతుందన్నారు. పరిస్థితులు లక్ష్య సాధనకు అడ్డంకులు కావని, అవకాశాలను విజయాలుగా మలచుకో వాలని అన్నారు. మానసికంగా దృడంగా ఉండాలని, సమస్యలకు ఆందోళన చెందకుండా, పరిష్కారానికి యోచన చేయాలన్నారు. లక్ష్య సాధనకు వనరులు ఎప్పుడు అడ్డంకి కాదని ఆమె తెలిపారు. శిక్షణా కేంద్రంలో ఇంకా కావలసిన వసతులును సమకూర్చడం జరుగుతుందని, వనరులు సృష్టించుకోవాలని, అవకాశాలు విజయానికి మెట్టుగా మలచుకోవాలని కలెక్టర్ అన్నారు. ఉద్యోగార్థుల సందేహాలు, అనుసరించాల్సిన విధి విధానలపై విద్యార్థులకు కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిటిడిఓ ప్రేమకళా, ఏసీఎం సారయ్య దొర, ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపల్ లింగాల శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

## ఉచిత పశువైద్య శిభిరం ఏర్పాటు



**మొగుళ్ళపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**

మండలంలోని బంగ్లపల్లి గ్రామంలో, వ్యవసాయమార్కెట్ కమిటీ చిట్యాల ఆధ్వర్యంలో. పశుసంవర్ధక శాఖ సౌజన్యంతో. ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ. మొగుళ్లపల్లి మండలంలోని రైతుసోదరులు తమ పాడి పశువులు ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉండేందుకు ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాట్లు చేశామని రైతు సోదరులు తమ పశువులను పశు వైద్య అధికారికి చూపించి డాక్టర్ సలహాలు పాటించి పశువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.ఆమెవెంట ఏఎంసి. వైస్ చైర్మన్ ఎండి రఫీ, డైరెక్టర్లు లింగయ్య, సతీష్ రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ కనుక .శేఖర్, మండల పశువైద్యాధికారి డాక్టర్. రాకేష్ శర్మ, ఎం .వెంకటేష్(జె వి వో), గోపాలమిత్ర శ్రీనివాస్, రాజన్న, అశోక్ , మార్కెట్ కమిటీ సిబ్బంది బొచ్చు రాజు, పడదల దేవేందర్ రావు, అల్లం సమ్మయ్య రైతు సోదరులు పాల్గొనడం జరిగింది.

## యువత మత్తుకు బానిస కావొద్దు

**హసన్పర్తి, తెలంగాణ ముచ్చట్లు :**

వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళాబృందం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలేజ్‌లో యువతకు గంజాయి, డ్రగ్స్, గుట్కా ఆన్లైన్ మోసాల బారిన పడొద్దని అలాగే డయల్ 100, షీ టీమ్స్, హ్యూ మన్ ట్రాఫికింగ్, సైబర్ మోసాల గురించి తెలియజేస్తూ సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 గురించి తెలిపారు. మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు, ధూమపానానికి దూరంగా ఉండాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఎస్ఐ రవీందర్, కాలేజ్ అండ్ డ్రగ్ కమిటీ అధ్యక్షులు శ్రీధర్, నాగార్జున రెడ్డి, కళాబృందం ఇంచార్జ్ ఏఎస్ఐ నాగమణి, విలియం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస పథకాన్ని అందరికీ అందేలా చేయాలి

**- గండ్ర వెంకటరమణారెడ్డి యువసేన నాయకుడు మిట్టపల్లి అరవింద్**

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**



తెలంగాణ ప్రభుత్వము యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకాన్ని స్వాగతిస్తున్నామని కానీ ఈ పథకాన్ని సొంత పార్టీ నేతలకే కాకుండా పక్షపాతం లేకుండా అర్హులైన యువత అందరికీ అందేల చేయాలని అన్నారు అదేవిధంగా ఈ పథకం యొక్క అర్హత విషయంలో కొన్ని మార్పులు చేర్పులు చేయాలని అన్నారు మరి ముఖ్యంగా ఈ పథకానికి తెల్ల రేషన్ కార్డును పరిగణలోకి తీసుకున్నారని అనేకమందికి తెల్ల రేషన్ కార్డులు లేవని ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రేషన్ కార్డులు ఇసా్త మని చెప్పడమే కానీ ఇప్పటివరకు మంజూరు చేయలేదని దానివల్ల చాలా మంది యువత ఈ పథకానికి అర్హులు కాకుండా పోతున్నారని అన్నారు ఈ ప్రభుత్వం చెప్పటమే కానీ చేసింది ఏం లేదని ఈ ప్రభుత్వం ఇప్పటికే చాలా హామీలు ఇచ్చిందని వాటిలో ఏది కూడా సరిగా నెరవేర్చలేదని ఈ హామినైన పక్షపాతం లేకుం డా అర్హులైన యువత అందరికీ సకాలంలో అందించాలన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం సంతోషంగా ఉంది



**- గాగిరెడ్డి తిరుపతి**

**ధర్మారం-తెలంగాణ ముచ్చట్లు :**

గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. ధర్మారం మండలంలోని బొమ్మరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అవరణలో మంగళవారం సన్ రైజ్ , స్టార్ హాస్పిటల్స్ కరీంనగర్ వారి అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అనందదాయకంగా ఉందని, ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ శిబిరంలో డాక్టర్ దామోదర్ ఎండి డిఎ, డాక్టర్ సాయి కృష్ణ జనరల్ పీజీషన్, డాక్టర్ పౌజీయ బేగం గైనకాలజిస్ట్,డాక్టర్ వర్షిణి పిల్లల వైద్య నిపుణులు పాల్గొని అందాద 450 మంది రొగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో క్యాంపు మేనేజర్ కొత్తూరు రాజేందర్,కొఆర్డినేటర్ క్యాతం సతీష్,మార్కెటింగ్ ఇంచార్జి బాలు, పిఆర్వొ తిరుపతి, స్థానిక ఆర్ఎంపీ లు,మునీందర్,సత్తయ్య గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## దూందాం కార్యక్రమానికి రావాల్చిందిగా అర్ కృష్ణయ్యకు అహ్వానం

**ధర్మారం- తెలంగాణ ముచ్చట్లు :**



డిల్లీలోని డా: బి ఆర్ అంబేద్కర్ స్మారక గృహాన్ని సందర్శించి, జంతర్ మంతర్ వద్దా జరగబోవు కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి ఆధ్వర్యంలో ధూమ్ ధాం నిర్వహించే కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు ఎన్ కృష్ణయ్య, బీదా మస్తాన్ రావులను కలిసి నేడు జరిగే కార్యక్రమానికి రావాల్చిందిగా ఆహ్వా నించడం జరిగిందని తెలిపారు.అహ్వాన పత్రం అందజేసిన వారిలో జాతీయ అధ్యక్షులు జెరిపోతుల పరుశురాం, జాతీయ ఉపాధ్యక్షులు బొల్లి స్వామి, సహాయక కార్యదర్శి పలిగిరి కనకరాజు, మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి కైలాసం, వరంగల్ జిల్లా నాయకులు తాడెం అనిల్, నల్గొండ జిల్లా నాయకులు పాలడుగు అంజి తదితరులు ఉన్నారు.

## హనుమాన్ మాల ధరించాడని విద్యార్థిపై దాష్టికం



**-సెయింట్ ఆన్స్ పాఠశాలలో సిబ్బంది నిర్వాకం..**

**పెద్దపల్లి- తెలంగాణ ముచ్చట్లు :**

హనుమాన్ మాల ధరించి పాఠశాలకు వచ్చిన విద్యార్థి పట్ల సిబ్బంది అనుచితంగా ప్రవర్తించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దీనికి సంబందించిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాకేంద్రంలో రంగంపల్లిలో గల సెయింట్ ఆన్స్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి హనుమాన్ దీక్ష ధారణ చేశాడు. యధావిధిగా పాఠశాలకు వచ్చిన విద్యార్థిని బట్టలు విప్పి స్కూల్ యూనిఫాములో రావాలని పాఠశాల సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు బాలుడిని రెండు గంటల పాటు క్లాసు బయట నిలబెట్టారని తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల వద్ద సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు.విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ నేతలు పాఠశాలకు చేరుకున్నారు. సిబ్బందితో మాట్లాడగా వారు పొంతన లేని సమాదానాలు చెప్పడంతో పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఉద్దేశ్యపూర్వకంగానే మాల ధారణ చేసిన విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షలో ఉన్న బాలుడి పట్ల అవమానకరంగా ప్రవర్తించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా తాము చేసింది పొరపాటేనని మరో సారి ఇలా జరగకుండా చూసుకుంటామని పాఠశాల హెడ్ మాస్టర్ క్షమాపణలు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పెద్దపల్లి సిఐ, ఎస్ఐ ఆందోళనకారులకు నచ్చజెప్పి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, పాఠశాలలో జరిగిన సంఘటన ఒక్కసారిగా పట్టణంలో చర్చణీయంశమైంది.

## ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణి

**-ఎస్సీ సేల్ మండల అధ్యక్షులు ఓనపాకాల ప్రసాద్**

**మొగుళ్ళపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సన్న బియ్యం పంపిణీకి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సేల్ మండల అధ్య క్షులు ఓనపాకాల ప్రసాద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ. నిరుపేదలకు చెందాల్సిన రేషన్ షాపులోని దొడ్డు బియ్యం అక్రమార్కులు రాష్ట్రాలు దాటించి సొమ్ము చేసుకున్నారని పేదల నోటికి చెందాల్సిన అన్నం దొంగల పాలవుతుందని భావించి. ఎలాగైనా నిరుపేదలకు న్యాయం చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యమంత్రితో పాటు పౌర సరఫరాల మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సన్న బియ్యం పంపిణి చేస్తేనే బియ్యం దొంగలకు అడ్డుకట్ట వేయచ్చని చర్చించి సన్న బియ్యం. ప్రజలకు పంపిణి చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు నిరుపేదల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందుకు అనుగుణంగా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీకి ప్రజా ప్రభుత్వం సన్నా హాలు చేస్తోందని. ఇందులో భాగంగా పౌర సరఫరాల శా ఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,సొంత నియోజకవర్గ మైన హుజూర్ నగర్‌లో ఈ పథకాన్ని ఉగాది పండుగ పర్వదిననా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పౌర సమాచార శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించడం మా నిరుపేదలకు ఆనందంగా ఉన్న దనీ సన్న బియ్యం పంపిణి చేసి నిజమైన పెదలపార్టీ కాం గ్రెస్ పార్టీ అని నిరూపించిందని రాష్ట్రంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏడాదిలో. రెండు సీజన్లలో సేకరించే సన్నధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించడం. ప్రభుత్వ కృషికి నిదర్శనమని. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులకు, నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఓనపాకాల ప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

## సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన

**మంచిర్యాల జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం సైబర్ క్రైమ్ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై చైతన్య పరిచేందుకు అవగాహన సదస్సు సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే www.cyber-crime.gov.in నందు రిపోర్ట్ చేయండి.మరియు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చెయ్యండి. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ. అంబర్ కిశోర్ఝా ఐపిఎస్, ఐజి,ఆదేశాల మేరకు రామగుండం విటీసీ సెంటర్ ల్లో గోదావరిఖనిలో సైబర్ నేరాలపై, సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్, ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు బెట్టింగ్‌లు, డిజిటల్ అరె స్ట్, ముల్టీలెవెల్లింగ్ మార్కెటింగ్, అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్స్, ఫెడెక్స్ కొరియర్ ఫ్రేడ్స్‌లోన్ యాప్‌ల, ఓటీపీ, ఓఎ ల్ఎక్స్ ఫ్రాడ్స్‌ల గురించి.సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 ఇంపార్టెంట్స్‌పై గురించి తెలిపారు.ఆన్లైన్ మో సాలపై అడ్డుకట్ట వేయుటకు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అన ర్థాలు కూడా జరుగుతున్నాయని, సెల్ ఫోన్ విని యోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే సైబర్ నేరాల గురించి 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని బ్యాంక్ కస్టమర్‌లకు సూచించారు. అవగాహన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అట్టెం. శంకర్, శేక్ రియాజ్, పెద్దల సంతోష్, కీర్తి వెంకటేష్, తిరుపతి, శ్రీని వాసు పాల్గొన్నారు.



## డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు
# ఘనంగా వీడ్కోలు

**కామారెడ్డి జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :**
కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ మర్కల్ గ్రామం నంది ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్ నందు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు కోర్సు పూర్తి చేసుకుని కళాశాలను వీడుతున్న సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు.విద్యార్థులు కాలేజీతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. శోభారాణి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాలకు ఆస్తి లాంటి వారని, కళాశాల పేరును నిలబెట్టేవారని తెలిపారు విద్యార్థులు ప్రతికూలతలను అనుకూలతలుగా మలచుకొని లక్ష్యం దిశగా ప్రయాణించాలని ఆకాంక్షించారు. ఆద్యంతం భావోద్వేగంతో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ సీ హెచ్.మీన, డా. డి.శ్రావణి, అధ్యాపకులు పాల్గొన్నారు.విద్యార్థులు నృత్యాలతో సందడి చేసారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
# ఒకరికీ గాయాలు



**మొగుళ్ళపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**
మండలంలో లారీ స్కూటర్‌ను డి కొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాగా ఒక బాలుడికి తీవ్ర గాయాలు. ఘటనకు సంబందించి స్థానికులు అందించిన సమాచారం మేరకు. చిట్యాల మండలం చింతకుంట రామయ్య పల్లి గ్రామానికి చెందిన. మోత్కూరి రాములు ముదిరాజ్, తన మనువడు తో కలసి టివిఎస్ ఎక్స్ ఎల్ ద్విచక్ర వాహనంపై మొగుళ్పల్లి మండలం ముల్కలపల్లి గ్రామానికి వెళ్తున్న క్రమంలో మొగుళ్లపల్లి పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో. జమ్మికుంట వైపు నుండి మొగుళ్లపల్లి వైపు ఎదురుగా వస్తున్న లారీ. స్కూటర్‌ను డికొట్టడంతో మోత్కూరి రాములు అక్కడికక్కడే మృతి చెందాగా బాలునికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సు లో చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆసుపత్రికి తరలించారని బాలుని పరిస్థితి విశమంగా ఉన్నట్లు స్థానికుల సమాచారం ఈరోడ్డు ప్రమాదం ఘటకు సంబందించి పూర్తి సమాచారం మొగుళ్లపల్లి పోలీసులు తెలియజేయాల్సి ఉంది.

## వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి



**వరంగల్ జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :**
అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (పీ.పీ యూనిట్) వారి ఆధ్వర్యంలో వరంగల్ ఆటోనగర్‌లోని జువెనైల్ వెల్ఫేర్ కరెక్షన్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేసిన డాక్టర్.ఎం.యశస్విని. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్. ఎం.యశస్విని విద్యార్థులందరికి మెడికల్ చెకప్ చేశారు. డాక్టర్ యశస్విని మాట్లాడుతూ....వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి, వేడి ఆహారం తీసుకోవాలని, ముఖ్యంగా గుడ్లు, పాలు, బ్రెడ్ మొదలైనవి తీసుకుంటే ఆరోగ్యం ఉంటుందని స్టూడెంట్స్‌కు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సూపర్డెంట్ శ్రీదేవి, ఎంజిఎం (పీ.పీ యూనిట్) హెచ్‌వీ నర్మద, రామ రాజేష్ ఖన్నా, ఆశా కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు చట్ట నియమాలను పాటించాలి

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**



గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ జిల్లా అద నపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జరిగిన పిసి అండ్ పిఎన్‌డిటి అధారిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్ట నియమాలను పాటించాలని, సక్రమంగా రికార్డులు నిర్వహించాలని, ప్రతి హాస్పటల్లో పిసి అండ్ పిఎన్‌డిటి చట్టానికి సంబంధించిన బోర్డును అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, వైద్యాధికారులు రిజిస్టర్ అయిన కేంద్రాలనే కాక రిజిస్టర్ గాని ఆసుపత్రులను కూడా తనిఖీ చేయాలని అన్నారు. ప్రజలలో అవగాహన కల్పించేందుకు పబ్లిక్ స్థలాల్లో గోడపత్రికలను ప్రదర్శించాల నీ ప్రజలలో అవగాహన కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఎస్‌హెచ్‌జి గ్రూపులను కూడా భాగస్వాములు చేయాలన్నారు. వీరు గ్రామాల్లోని మహిళలకు అవగాహన కల్పించడమే గాక గర్భిణీ స్త్రీలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ ఓ డాక్టర్ అప్పయ్య, డిఆర్డిఓ మీనా శ్రీను,డిడబ్ల్యుఓ జయంతి , కమిటీ సభ్యులు ఇవి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ కరుణాకర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.


# మున్సిపల్ ఆదాయం పెంచుకొని పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

- 100శాతం పన్నుల వసూలుకు ప్రత్యేక కార్యాచరణ
- వాస్తవిక బడ్జెట్ లను రూపొందించి వాటి అమలుకు కృషి చేయాలి
- ఆదాయం పెంచుకునేలా పట్టణాలలో పన్నుల
- రీ-అసిస్మెంట్ చేయాలి
- 3 మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్ బడ్జెట్ తయారీపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్




**పెద్దపల్లి-తెలంగాణ ముచ్చట్లు :**
అనవసర ఖర్చులు తగ్గించి, మున్సిపల్ ఆదా యాన్ని పెంచుకొని పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత కలెక్టరేట్‌లో 3 మున్సిపా లిటీలు, రామగుండం కార్పొరేషన్ బడ్జెట్ తయారీపై అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మున్సిపల్ ఆదాయ వనరులపై కౌన్సిల్ సమావేశంలో చర్చ నిర్వహించి ఆదాయాన్ని పెంచుకునేందుకు తీసుకోవలసిన చర్యలపై దృష్టి సారించాలని అన్నారు. మన మున్సిపల్ పరిధిలో ఆదాయాన్ని పెంచుకున్నప్పుడే మన వార్డులు డివిజన్లలో మరింత అభివృద్ధికి అవకాశం ఉన్నదని తెలిపారు. మున్సిపల్ ఆదాయం పెంచుకున్న సందర్భంలో మనకు కావాల్సిన అభివృద్ధి సౌకర్యాలను ఏర్పాటు చేసు కోవచ్చని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ 100% పన్ను వసూలకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం పట్టణాలను సుందరంగా, ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేసుకోవడం జరుగుతుం దనీ, ఇంకను ఆదాయ మార్గాలు పెంచు కున్న ప్పుడు పలు రకాల, మరింతగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు. పట్టణాలలో ఆదాయం మార్గాలు పెంచుకునేందుకు పన్నుల అవసరమైన చోటరీ - అసెస్మెంట్ చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యయాలు తగ్గించుకుంటూ, ఆదాయాన్ని జాగ్రత్తగా వాడుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలనీ తెలిపారు. పట్టణాలలో ప్రాధాన్యత ప్రకారం పనులు చేపట్టాలని , ప్రజల మౌలిక వసతుల కల్పన పనులకు ముందుగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు, పాల్గొన్నారు.

# పదేళ్లలో ఇండియా జీడీపీ డబుల్




**ఇంటర్‌నెట్ డెస్క్, తెలంగాణ ముచ్చట్లు :**
భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతోంది. గతంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి గాడిలో పడింది. కాస్త మందగమనం ఉన్నప్పటికీ.. అనేక విషయాల్లో భారత ఆర్థిక వ్యవస్థ ముందంజలోనే ఉంది. ఈ క్రమంలో ఈజ25లో భారతదేశ జీడీపీ వృద్ధి గత 10 సంవత్సరాలలో రెట్టింపు అయిం ది. 2015లో 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి 4.3 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేయడం జరిగింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి విడుదల చేసిన డేటాలో ఈ సమాచారం ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడం వల్ల, భారతదేశ జీడీపీ 2025లో జపాన్, 2027లో జర్మనీ కంటే ముందు వరుసలో నిలవనుంది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. ఇది విధాన సంస్కరణలు, బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా పేర్కొంది. 10 సంవత్సరాలలో భారతదేశం తన స్థూల దేశీయోత్పత్తిని రెట్టింపు చేసి 105 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఐఎంఎఫ్ డేటా తెలిపింది. 2015లో 2.1 ట్రిలియన్ డాటర్ల నుండి 2025లో 4.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. గతంలో పోల్చితే, అదే కాలంలో అమెరికా 66 శాతం, చైనా జీడీపీ 44 శాతం పెరిగాయి. దీంతో, భారతదేశం ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్ (30.3 ట్రిలియన్ డాలర్లు), చైనా (19.5 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4.9 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.4 ట్రిలియన్ డాలర్లు) తర్వాత ప్రపంచంలో పరంగా ఐదవ అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం, గత దశాబ్దంలో జపాన్ జీడీపీ సున్నాగా పెరగడంతో, భారతదేశం త్వరలో జపాన్‌ను అధిగమించనుంది. గత దశాబ్దంలో యునైటెడ్ కింగ్‌డమ్ జీడీపీ 28 శాతం వృద్ధి చెందగా, ఫ్రాన్స్ జీడీపీలో 38 శాతం వృద్ధిని సాధించింది. 2015లో 2.4 ట్రిలియన్ డాలర్ల నుండి 2025 నాటికి 3.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 50 శాతం కంటే ఎక్కువ జీడీపీ వృద్ధిని సాధించిన ఇతర అగ్ర ఆర్థిక వ్యవస్థలు రష్యా (57 శాతం), ఆస్ట్రేలియా (58 శాతం), స్పెయిన్ (50 శాతం)గా ఉన్నాయి. భారతదేశ జీడీపీ వృద్ధిని అపూర్వమైన రేటుతో చూపిస్తున్న డేటాను బిజెపి మంత్రి అమిత్ మాల్వియా తన అధికారిక చీ పోస్ట్ ద్వారా పంచుకున్నారు.ఈ వృద్ధి వేగం భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక సూపర్ పవర్‌గా నిలబెట్టింది. 2025 నాటికి జపాన్‌ను, 2027 నాటికి జర్మనీని అధిగమిస్తుందని బీజేపీ నాయకుడు అమిత్ మాల్వియా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్‌లో షేర్ చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ అసాధారణ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి, ఆయన ప్రభుత్వ అవిశ్రాంత కృషికి నిదర్శనమని మాల్వియా పేర్కొన్నారు. చురుకైన ఆర్థిక విధానాలు, సాహసోపేతమైన నిర్మాణాత్మక సంస్కరణలు, వ్యాపారాన్ని సులభతరం చేయడంపై అవిశ్రాంత దృష్టి ద్వారా, మోదీ ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మార్చింది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మునుపటి ఏ ప్రభుత్వం సాధించని విజయం ఇది అని అమిత్ మాలవ్య అన్నారు. మార్చి నెల ప్రారంభంలో, భారతదేశం వివేకవంతమైన విధానాలను ప్రశంసిస్తూ, ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు, దేశం బలమైన ఆర్థిక పనితీరు 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారడానికి కీలకమైన సంస్కరణలను స్వీకరించడంలో సహాయపడుతుందని పేర్కొంది. అధిక-నాణ్యత ఉద్యోగాలను సృష్టించడానికి, దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి నిర్మాణాత్మక సంస్కరణలు చాలా కీలకమని ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు పేర్కొంది.దేశ జీడీపీలో ప్రైవేట్ వినియోగం వాటా పెరిగినందున దేశ ఆర్థిక వృద్ధి మరింత సమతుల్యంగా మారుతోందని ఇటీవల విడుదలైన క్రిసిల్ నివేదిక వెల్లడించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు. సాధారణ రుతుపవనాలు, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం, ప్రస్తుత ద్రవ్య చక్రంలో 75-100 బేసిస్ పాయింట్ల రేటు కోతలు వంటి అంశాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు.దేశంలో ప్రైవేట్ వినియోగం నానాటికీ పెరుగుతుంది. ఇది ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ, గృహ పెట్టుబడులు రెండూ వేగంగా అభివృద్ధి చెందాయి. అయితే భారత్‌లో కార్పొరేట్ పెట్టుబడులు ఇంకా ఆశించినంతగా పుంజుకోలేదు. కొనసాగుతున్న సుంకాల యుద్ధాలు, చైనా డంపింగ్ భయం కారణంగా కార్పొరేట్ రంగం పెట్టుబడులపై అంతగా ఆసక్తి చూపడం లేదు. టారిఫ్‌ల వల్ల వచ్చే నష్టాల సంక్లిష్టత ఇప్పటికే ప్రారంభమైంది. రాబోయే నెలల్లోనూ ఇది కొనసాగే అవకాశం ఉంది. దీంతో మా అంచనాలకు ప్రతికూలతలు సృష్టిస్తుందని జోషి అన్నారు.

# మళ్లీ కవ్విస్తున్న చైనా

**న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు :**
భారత్?చైనా సరిహద్దు వివాదం పరిష్కారానికి చర్చలు జరుగుతున్న వేళ, చైనామరోసారి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది. లద్దాఖ్ భూభాగంలోని కొంత ప్రాంతంలో రెండు కొత్త కౌంటీలుహెఆన్, హెకాంగ్‌ఏర్పాటు చేస్తున్నట్లు 2024 డిసెంబర్ 27న చైనా ప్రకటించింది. ఈ కౌంటీలు న్‌జియాంగ్‌లోని హోటన్ ప్రిఫెక్చర్‌లో ఉన్నప్పటికీ, వీటిలో కొంత భాగం భారత్ లద్దాఖ్‌లోని అక్సాయ్ చిన్‌లోకి చొచ్చుకొస్తుందని కేంద్రం ఆరోపిస్తోంది. దీనిపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, ఈ దురాక్రమణను ఎన్నటికీ సహించబోమని స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌పార్లమెంట్‌లో ఇలా వెల్లడించారు: “చైనా కౌంటీల ఏర్పాటు మా దృష్టికి వచ్చింది.
ఈ కౌంటీ ల్లో కొన్ని భాగాలు లద్దాఖ్ పరిధిలోని భారత భూభాగంలోకి వస్తాయి. ఈ అక్రమ ఆక్రమణను మేం ఎప్పుడూ అంగీకరి ంచలేదు. భారత సార్వభౌమత్వంపై మా స్థిరమైన వైఖరిని ఈ చర్యలు మార్చలేవు, చైనా బలవంతపు ఆక్రమణకు చట్టబద్ధతనూ ఇవ్వలేవు.” ఈ విషయంలో భారత్ దౌత్య మార్గాల ద్వారా నిరసన తెలిపినట్లు ఆయన తెలిపారు. చైనా ఈ కౌంటీలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధి ప్రాజెక్టులను కూడా చేపడుతోందని, దీనిపై తమకు సమా చారం ఉందని విదేశాంగ శాఖ వెల్లడించింది.



# తమిళనాడులోకి జనసేన?

**చెన్నై, తెలంగాణ ముచ్చట్లు :**
పవన్ కళ్యాణ్ కొద్ది రోజులుగా తమిళనాడులో సైతం హల్చల్ చేస్తున్నారు. పవన్ సనాతన ధర్మ పరిరక్షణకు బలమైన వ్యవస్థ కావాలని పోరాట బాట పట్టినప్పుడు తమిళనాడు నుంచి ఎక్కువగా విమర్శలు వచ్చాయి. తమిళ నేతలంతా పవన్ పై వ్యక్తిగత కామెంట్లకు సైతం దిగారు. నటుడు ప్రకాష్ రాజ్ అయితే బిజెపి అజెండా అంటూ అనుమానాలు కూడా వ్యక్తం చేశారు. మొన్నటికి మొన్న హిందీ భాష పై జరిగిన వివాదంలో కూడా పవన్ తమిళ నేతల తీరును తప్పు పట్టారు. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో ఏ రాష్ట్ర నేతలతో లేని విధంగా తమిళ నేతలతో పవన్ ఆగ్రహంగా వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిచ్చింది. అయితే పవన్ తమిళ నాడులో జనసేన విస్తరించాలన్న ఆలోచనతో ఇదంతా చేసినట్లు ప్రచారం ప్రారంభమైంది. అందుకు తగ్గట్టుగానే పవన్ సైతం ఈ విషయంలో క్లారిటీ ఇచ్చారు.వరుసగా తమిళ నేతలతో జరుగుతున్న వివాదాల నేపథ్యంలో.. ఓ తమిళ టీవీ పవన్ కళ్యాణ్ ను ఇంటర్వ్యూ చేసింది. ఈ క్రమంలో తన జనసేన తమిళనాడులో విస్తరిస్తానని తేల్చి చెప్పారు పవన్ కళ్యాణ్. ఇటీవల పిఠాపురం జనసేన ఆవిర్భావ సభలో పవన్ హిందీ విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే హిందీ భాషను తమపై బలవంతంగా రుద్దుతు న్నారని తమిళనాడులో ఆగ్రహవేశాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తరుణం లో పవన్ చేసిన వ్యాఖ్యలు మిస్ ఫైర్ అయ్యాయి. ఈ క్రమంలో ఆయన వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. హిందీ నిర్బంధంగా నేర్పించాలనే విధానానికి తాను కూడా వ్యతిరేకమని స్పష్టం చేశారు. తాను స్వచ్ఛందంగానే తమిళంతో పాటు హిందీని నేర్చుకున్నట్లు తెలిపారు.పవన్ హిందీ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిటిష్ వారు తీసుకొచ్చిన ఇంగ్లీష్ భాష నేర్చుకోవడానికి లేని భయం.. దేశంలోని హిందీ భాష నేర్చు కునేందుకు ఎందుకని పవన్ ప్రశ్నించారు. నేతలు హిందీలో ప్రసంగాలు చేస్తుంటారు. కానీ హిందీని మాత్రం విమర్శిస్తుంటారని తప్పు పట్టారు పవన్. మరోవైపు తమిళనాడులో బిజెపి తప్పకుండా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు పవన్. రాజకీయాల్లో ఏదైనా జరగవచ్చునని చెప్పారు. భవిష్యత్తులో తన జనసేన సైతం తమిళనాడులో విస్తరించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారుఇటీవల జరుగుతున్న పరిణామాలతో తమిళనాడులో జనసేనను అభిమానించేవారు పెరుగుతున్నారు. తమిళనాడు రాజకీయాల్లో భిన్న పరిస్థితుల నేపథ్యంలో పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని సైతం జై కొట్టిన వారు ఉన్నారు. అందుకే పవన్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీకి తమిళ నాడులో కూడా విపరీతమైన అభిమానులు ఉన్నారు. పవన్ కళ్యాణ్ ప్రసంగాలను తమిళనాడు వాసులు ఎక్కువగా వాచ్ చేస్తుంటారు. డబ్బులు అవసరం ఉన్నన్ని రోజులు నటిస్తానని కూడా చెప్పుకున్నారు పవన్ కళ్యాణ్. రాజకీయాలతో పాటు సమానంగా సినీ కెరీర్ కొనసాగుతుందని.. అదే సమయంలో వివిధ రాష్ట్రాల్లో జనసేన విస్తరించనునట్లు కూడా చెప్పారు పవన్.

# పేకాట రాయుళ్ల అరెస్ట్



**శాయంపేట, తెలంగాణ ముచ్చట్లు :** ఈనెల 24న సాయంత్రం స్థానిక ఎస్సై పరమేష్ పోలీస్ సిబ్బందితో మైలారం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన చల్లా అమరేందర్ రెడ్డి ఇంటి ముందు కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం రాగానే వెంటనే అక్కడికి వెళ్ళి పేకాట స్థావరం పై దాడి చేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 17520 రూపాయలు, 6 మొబైల్ ఫోన్లు,పేక ముక్కలని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎం. కుమారస్వామి పోలీసులు డి. శ్రీనివాస్, ఎండి ఖలీల్, వి శివ శంకర వర ప్రసాద్, కె రాజు పాల్గొన్నారు.

# ఆశావర్కర్లపై లాఠీచార్జి సరికాదు: సీఐటీయూ

**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :** ఆశాలకు ఫిక్స్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఇచ్చిన పిలుపులో భాగంగా హైదరాబాద్‌లోని మెడికల్ కమిషనరేట్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో ప్రభుత్వం ఆశలపై లాఠీచార్జి చేసి అక్రమంగా అరెస్టు చేసి కేసు లు పెట్టడాన్ని నిరసిస్తూ సిఐటియు హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్ నుండి అంబేద్కర్ సెంటర్ వద్దకు వరకు ప్రదర్శన నిర్వహించి అరగంట పాటు రాస్తారోకో చేయడం చేశారు. దీంతో ట్రాఫిక్ పెద్ద ఎత్తున స్తంభించింది ఆశాల ఐక్యత వర్ధిల్లాలి ప్రభుత్వ నిర్బంధం ఆపాలి అక్రమ కేసులు ఎత్తివేయాలి సిఐటియు జిందాబాద్ ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటి యు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆశాలపై లాఠీచార్జి నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండి





స్తుందని అన్నారు మహిళలపై మగ పోలీసుల చేత నాటి లాఠీచార్జి చేయడం బలవంతంగా ఆరెస్ట్ చేస్తూ మహిళలని చూడకుండా ఈడ్చి వ్యాన్లో ఎక్కిం చడంతో చాలామంది ఆశాలు సోమ్మసిల్లి పోయారని ఈ విధంగా మహిళలపై దాడులు సరైనవి కావు అన్నారు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకే 18000 ఆశాలు డిమాండ్ చేస్తున్నారని ఇచ్చిన హామీని అమలు చేయడానికి ముఖ్యమంత్రి 15 నెలలు గడుస్తున్న ఎందుకు అమలు చేయడం లేదని ఆయన డిమాండ్ చేశారు డ్యూటీలో మరణిస్తే ఆశలకు 50 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ఆశలను మూడవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ సిఐటియు నాయకులు సిహెచ్ రాజేశ్వరి ఈ శోభ లీల గౌర్రె పుతిలి రమ భాగ్య సంపూర్ణ స్వప్న ఏం కవిత తార పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి



**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** అసెంబ్లీ ఎన్నికల్లో తమ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టీసీలో వికలాంగులకు 100 శాతం రాయితీతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అభయాస్త్రం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 15 నెలల పాలన పూర్తయిన నేటికీ వికలాంగులకు ఇచ్చిన ఉచిత ప్రయాణ సౌకర్య హామీని నెరవేర్చకపోవడం దురదృష్టకరమని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీలో వికలాంగులకు వెంటనే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాదు కేంద్రంగా ఉన్న మహాత్మా గాంధీ బస్ స్టేషన్ సంఘం నేతలతో కలిసి అర్ధనగ్న ప్రదర్శన తో వినూత్న నిరసన తెలిపిన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడు భారతదేశంలోని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి వికలాంగుల సమాజంపై చూపని వివక్ష తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూపిస్తున్నారని ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఆర్టీసీలో ఆడవారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అట్టడుగున ఉండి దుర్భర జీవితాలు గడుపుతున్న వికలాంగులకు ఆయన కాంగ్రెస్ పార్టీ అభయాస్త్రం మేనిఫెస్టోలో ఇచ్చిన ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే హామీని నేటికీ నెరవేర్చకుండా వెనకడుగు వేస్తున్న తీరు బాధాకరమని వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్లు తమ తీరు మార్చుకొని అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీలో వెంటనే 100% రాయితీతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల పెన్షన్ 6000 పెంచాలని రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిట్టి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేసి ప్రత్యేక శాఖగా కొనసాగించాలని ముఖ్యంగా రాబోయే పంచాయితీ ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని లేకుంటే భారత వికలాం గుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాల ను ఉధృతం చేస్తామని తెలిపారుఈ నిరసన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు సంఘం గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల గోపాల్ రాష్ట్ర మహిళా నాయకురాలు గుడిపల్లి సుమతి నల్గొండ జిల్లా మహిళా నాయకురాలు గుండెబోయిన అలివేలు చండూరు మండల అధ్యక్షుడు ఆకారపు వెంకన్న చండూరు మండల ఉపాధ్యక్షులు పలసగొని రవి మునుగోడు మండల ఉపాధ్యక్షులు ఒంటెపాక ముత్తయ్య చండూరు మండల యువజన విభాగం అధ్యక్షులు శ్రీకాంత్ మునుగోడు మండలం నాయకులు ఈద పరమేష్ చండూరు మహిళా అధ్యక్షురాలు రేణుక పాల్గొన్నారు.

# ఫ్లెక్సీ ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి




**సిద్దిపేట, తెలంగాణ ముచ్చట్లు :** సిద్దిపేట లింగారెడ్డిపల్లి 1వ వార్డులో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు తాటికొండ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో బీజేపీ బలపడుతుంటే ఓర్వని కొందరు చిల్లర వ్యక్తులు ఫ్లెక్సీలు చిప్పి శునక ఆనందం పొందుతున్నారన్నారు బీజేపీ నాయకులను భయపెడుదాం అంటే భయపడరు అని అన్నారు. బీజేపీ ఎంపీని అగౌరవరిచి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారి పై చట్టపరమైన చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆకారం విజయ్ ,కసనగొట్టు సంతు,తాటికొండ లక్ష్మణ్ , పశికంటి నరేష్,నక్కల రాజు, చెందిరెడ్డి భార్గవ్ , భూమేష్, నరేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**భద్రాద్రి ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వాల్ బ్లాక్ అయ్యి స్టంట్ పడ్డ సంజీవ్ కుటుంబానికి సభ్యుల సహకారంతో రూ. 25800 ఆర్థిక సాయం అందజేశారు.

# దేశం అభివృద్ధి చెందాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ కావాలి



**దామెర, తెలంగాణ ముచ్చట్లు :** దేశం అభివృద్ధి చెందాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరామ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఒకే దేశం -ఒకే ఎన్నిక భారత దేశం ఏకకాలిక ఎన్నికల సంస్కరణల కార్యాచరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు మరియు దామెర మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరామ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వన్ నేషన్ వన్ ఎలక్షన్ నిర్వహించడం వలన దేశంలో ప్రజలందరికీ మంచి జరుగుతుందనీ, సమయం డబ్బు ఆదావుతుందనీ, దేశం అనేక రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ పిఎసిఎస్ డైరెక్టర్ మాదారపు రతన్ కుమార్, ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేవైఎం జిల్లా కోశాధికారి సూర చంద్రర్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ కొట్టే రమేష్, కో కన్వీనర్ గండు ముఖేష్, సీనియర్ నాయకులు గువ్వ సాంబయ్య, ఆలేటి పోషాలు, దామెర పృథ్వీరాజ్, శక్తి కేంద్ర ఇన్చార్జ్ లు ఎక్కలదేవి రమేష్, గోగుల సమ్మిరెడ్డి, గండు పరుశురాం, బూత్ అధ్యక్షులు బి.రమేష్, చెల్పూరి రాజు, గూడూరు శ్రీనివాస్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

# షాపింగ్ కాంప్లెక్స్, అంగడి వేలం వాయిదా

**శాయంపేట, తెలంగాణ ముచ్చట్లు :** శాయంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శాయంపేట స్పెషల్ ఆఫీసర్ తహసిల్దార్ కల్వల సత్యనారాయణ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాటలో షాపింగ్ కాంప్లెక్స్‌లో 7 గదులకు, 5 గదులకే టెండర్ పడ్డాయని, మొత్తం 7 గదులకు టెండర్ పడి ఒక్కో రూముకు ఇద్దరు చొప్పున టెండర్ వేస్తేనే టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. అంగడి వేలం గత సంవత్సరం కంటే తక్కువ ధరకు వేలం పాట పాడడంతో అంగడి వేలాన్ని కూడా వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 28 తేదీన ఉదయం 10.30 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించ నున్నట్లు తెలిపారు.వేలం పాటలో పాల్గొనేవారు షాపింగ్ కాంప్లెక్స్ 10 వేల రూపాయల డిపాజిట్‌తేదీ 27 సాయంత్రం 5 గంటల లోపు చెల్లించిన వారు మాత్రమే ఈనెల 28 తేదీన నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలన్నారు. పాట దక్కిన వారు 1/2 రూపాయలు ఇదే రోజున చెల్లించాలని తెలిపారు.

# అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ ప్రాధాన్యం



**సిద్ధిపేట, తెలంగాణ ముచ్చట్లు :** సిద్దిపేట రూరల్ మండలం చిన్న గుండవెల్లి గ్రామంలో రెడ్డి కమ్యూనిటీ హాల్ తదుపరి మరమ్మతు పనులకు సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ రూ. 10 లక్షల ఎస్‌డిఎఫ్ నిధులు మంజూరు చేయించారు. పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తుందని వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ సంఘ సభ్యులు. పటేల్ రెడ్డి, రాజిరెడ్డి, నరసింహారెడ్డి, రాజిరెడ్డి, దుర్గారెడ్డి, లక్ష్మారెడ్డి, మైపాల్ రెడ్డి, పోలీస్ జనార్దన్ రెడ్డి, పద్మ రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్ రెడ్డి, ఎల్లారెడ్డి, రాంరెడ్డి కరుణాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి కనక రెడ్డి నితీష్ రెడ్డి శేఖర్ రెడ్డి సుధాకర్ రెడ్డి రామ్ రెడ్డి రాములు రామచంద్రం బాబేష్ కుమార్ వెంకట్ రమేష్ యాదగిరి నరహరి శివకుమార్ శ్రీనివాస్ రెడ్డి మల్లారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఎల్లారెడ్డి రాజిరెడ్డి పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్ దక్కేనా ?

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణ రాజకీయాల్లో మంత్రివర్గ విస్తరణ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు పూర్తయినా,ఇంకా కాబినెట్ లో 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాల వారీగా మంత్రి పదవులకు ఆశావహులు ఎక్కువ వడంతో కాబినెట్ కూర్పు ఆలస్యమవుతుంది. తెలంగాణలోని ప్రధాన జిల్లాల నుంచి మంత్రి పదవులు ఆశిస్తున్నవారి జాబితాను పరిశీలిస్తేనల్గొండ జిల్లా నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి (రెడ్డి) ?ఇప్పటికే మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు. మంత్రి పదవి కావాలంటూ అసమ్మతి గళం వినిపిస్తున్నారు. మరో వైపు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య (బీసీ) ?బీసీ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానం వద్ద లాబీయింగ్ చేస్తున్నారు. బాలు నాయక్ (ఎస్టీ) ? దేవరకొండ నియోజకవర్గం నుంచి ఎస్టీ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించా లని డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా నుండి సీఎం రెవంత్ రెడ్డికి సమీప బంధువు సుదర్శన్ రెడ్డి మాజీ మంత్రి ఒక్క మంత్రి కూడా లేని తమ జిల్లాకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు..రెడ్డి వర్గంలో ఒక మంత్రి పదవి ఆయనకు దక్కే అవకాశాలు ఎక్కువ అనే చర్చ జరుగుతుంది. రంగారెడ్డి జిల్లా నుండి ప్రాతినిధ్యం లేకపోవడంతో కేబినెట్‌లో మంత్రిగా అవకాశం కల్పించాలని మల్ రెడ్డి రంగారెడ్డి (రెడ్డి) ఓసి కోటాలో లాబీయింగ్ చేస్తున్నారు. మైనార్టీ లలో కూడా కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే లేకపోవడంతో ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ (ముస్లిం మైనారిటీ).. ముస్లిం వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలనే కాంగ్రెస్ వ్యూహంలో కీలకమైన పేరుగా వినిపిస్తుంది.. పెద్దపల్లి జిల్లాలో బలమైన నేతగా పేరున్నప్రేమ్ సాగర్‌రావు (వెలమ).. వెలమ వర్గానికి మంత్రి పదవి ఖరారుచేసే అవకాశం ఉంది. మహబూబాబాద్ జిల్లా నుండి ఎస్సీ కోటాలో ఓ ఛానల్ అధినేత గడ్డం వివేక్ (ఎస్సీ మాల) ? ఎస్సీ వర్గానికి మంత్రిగా ప్రాతినిధ్యం ఇవ్వాలనే డిమాండ్ తో అధిష్టానం పరిశీలనలో బలంగా ఉంది. ఇప్పటికే కాబినెట్ లో ఉన్న పన్నెండు మంది మంత్రులలో రెడ్డి సామాజిక వర్గం నుండి ?నలుగురు,బీసీ వర్గం నుండి ఇద్దరు, ఎస్సీ వర్గం నుండి ఇద్దరు ఎస్టీ వర్గం నుండి ఒకరు,మిగతా ముగ్గురు ఇతర సామాజిక వర్గాల నుండి ఉన్నారు. కాంగ్రెస్ నుండి ముస్లిం ఎమ్మెల్యే లు ఒక్కరు కూడా గెలవకపోవడంతో ముస్లిం మైనారిటీలు ఎవరు మంత్రులుగా లేరు.మంత్రివర్గంలో మైనారిటీ వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడంతో కాంగ్రెస్ వ్యూహంలో ముస్లిం వర్గానికి ఒక మంత్రి పదవి ఖాయమని సమాచారం ఉంది. ఇక తెలంగాణ మంత్రివర్గంలో బీసి మహిళా మంత్రుల సంఖ్య తక్కువగా ఉంది.కొండా సురేఖ తో పాటు ఎస్టీ కోటాలో సీతక్క మంత్రిగా ఉన్నారు. తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నికైన సినీ నటి విజయశాంతికి బీసీ కోటాలో మరో మహిళా మంత్రిగా పదవి దక్కే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా, తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కేవలం పదవుల పంపిణీ కాదని, రాబోయే ఎన్నికల వ్యూహానికి కీలకం అని స్పష్టమవుతోంది. రాబోయేరోజుల్లోఎవరెవరు మంత్రులు అవుతారు?ఏ సామాజిక వర్గాలకు ప్రాధాన్యం దక్కుతుంది?, కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది..

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala, Dharmasag Hanmakonda, 506151.Editor:BOLLEPAKA RAJESH. RNI:TELTEL/2013/ 88710. Contact: 9493669669. Email: telanganamuchatlu.in@gmail.com.Website : www.telanganamuchatlu.in